




RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 308 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 24-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


## ఎవరిపైనో వేటు?

- తిలక్ వర్మా .. అభిషేక్ శర్మా?
- ఓపెనర్‌గా సంజూకు చాన్స్!
- టీమిండియా కూర్పుపై చర్చ



న్యూఢిల్లీ

టీ20 వరల్డ్‌కప్ సూపర్-8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఘోర పరాజయం తర్వాత భారత జట్టు కూర్పుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జట్టులో మార్పులు చేయడానికి మేనేజ్‌మెంట్ సిద్ధమవుతున్నట్టుగా సంకేతాలు అందుతున్నాయి. ముఖ్యంగా ఫామ్ కోల్పోయి జట్టుకు భారంగా మారిన టాపార్డర్ బ్యాటర్లలో ఒకరిపై వేటువేసే ఆలోచనలో ఉన్నట్టు సహాయ కోచ్‌లు టెన్ డష్కాటే, సితాన్షు కోటక్ మాటలను బట్టి తెలుస్తోంది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌తోపాటు వన్‌డౌన్‌లో వస్తున్న తిలక్ వర్మ కూడా లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్లు కావడంతో.. ఈ కాంబినేషన్ అంతగా విజయవంతం కావడం లేదన్న టాక్ వినిపిస్తోంది. ఈ క్రమంలో అభిషేక్ లేదా తిలక్‌లో ఒకరిపై వేటుపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. లెఫ్ట్-రైట్ కాంబినేషన్ కోసం వరుసగా విఫలమవుతున్న అభిషేక్ స్థానంలో సంజూ శాంసన్‌కు తుది జట్టులో చోటు కల్పించవచ్చు. ఇక, తిలక్ ఫామ్ కూడా మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది.

-మిగతా 2 లో

## వికసిత బెంగాల్ బాధ్యత నాది

- ఆందోళన కలిగించేలా బెంగాల్లో చొరబాట్లు
- బంగారు బంగ్లా కలలు సాకారం చేసుకుందాం
- బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ



న్యూఢిల్లీ ఫిబ్రవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బెంగాల్ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొద్ది నెలరోజుల్లో బెంగాల్ భవితను నిర్ణయించే కీలక ఎన్నికలు జరుగనున్నాయని, భావితరాల భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రజలు వివేకవంతమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బంగారు బంగ్లా కలల సాకారానికి తాను భరోసా ఇస్తున్నానని

-మిగతా 2 లో

## అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

- విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ
- జీఎంఆర్,ఫిక్కీ సంస్థలతో ఒప్పందం
- ఉపాధి బాధ్యత కూడా ప్రభుత్వానిదే అన్న సీతక్క



హైదరాబాద్, ఫిబ్రవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )

అనాథ పిల్లల ఉద్యోగ కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అథారిటీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీతో (ఫిక్కీ) తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న అనాథ యువతకు విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ కల్పన దిశలో ఒప్పందాలు జరిగాయి. ఎయిర్‌పోర్టు ఆపరేషన్, కార్గో, గ్రౌండ్ హ్యాడ్లింగ్ వంటి కోర్సుల్లో దశల వారీగా శిక్షణ ఇవ్వనున్నాయి. శిక్షణ ద్వారా అనాథ యువతకు ప్రైవేట్, అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థల్లో ఉద్యోగాలు కల్పించ నున్నారు.

-మిగతా 2 లో

## మే 11 నుంచి జనగణన

**16 నుంచి అసెంబ్లీ**

- 20న రాష్ట్ర బడ్జెట్
- ఆగస్టులో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు
- మెట్రో స్వాధీనానికి మంత్రివర్గ ఉపసంఘం
- రైతు భరోసాకు నిధులు విడుదల
- ప్రభుత్వోద్యోగులకు ప్రమాదబీమా
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

హైదరాబాద్ ఫిబ్రవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 16వ తేదీ నుంచి జరగనున్నాయి. అదేరోజు గవర్నర్ ప్రసంగం, 20వ తేదీ 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలిలో శాసనసభావ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. సోమవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో తొలి ఎజెండాగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల గురించి చర్చించినట్టు

-మిగతా 2 లో






## ఇండియా కూటమిలో నాయకత్వ మార్పు?

- రాహుల్ గాంధీని తప్పించాలి!..
- ఏ ఎన్నికల్లోనూ గెలువలేదని విమర్శలు
- తెరపైకి స్టాలిన్, మమతా బెనర్జీల పేర్లు
- డీఎంకే చీఫ్ బెటరన్న మణిశంకర్ అయ్యర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిని దీటుగా ఎదుర్కోవడానికి ఏర్పాటు చేసిన ఇండియా కూటమి కుంటినడకన సాగుతున్నది. ముఖ్యంగా కూటమి వైఫల్యానికి ఇంతవరకు దానికి నేతృత్వం వహించిన రాహుల్ గాంధీ వైపే ముఖ్య పార్టీలు వేలెత్తి చూపుతున్నాయి. ఇది ఏర్పడిన తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ ఇండియా కూటమి గెలిచిన పాపాన పోలేదన్న విషయాన్ని అవి ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాయి. ఈ క్రమంలో ఇండియా కూటమి నాయకత్వ మార్పుపై మరోసారి చర్చకు తెరలేచింది. విపక్ష ఇండియా కూటమికి డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ సరిగ్గా సరిపోతారంటూ కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ సోమవారం చేసిన వ్యాఖ్యలతో విస్తృతంగా చర్చ ప్రారంభమైంది.

-మిగతా 2 లో



## బంగ్లాదేశ్‌లో ఆగని దారుణాలు

- హిందూ దివ్యాంగురాలుపై సామూహిక అత్యాచారం
- స్థానికంగా నివాసం ఉండే రకీబ్, సోహైల్, రస్సెల్ అనే ముగ్గురు వ్యక్తులు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు వెల్లడి
- ఇప్పటి వరకు పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఢాకా

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, అకృత్యాలు రోజురోజుకూ తీవ్రమవు తున్నాయి. తాజాగా మరో దారుణం చోటుచేసుకుంది. చాంద్‌పుర్ జిల్లాలో హిందూ మహిళపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి 9గంటల సమయంలో ఒంటరిగా ఉన్న దివ్యాంగురాలైన మహిళను బలవంతంగా ఎత్తుకెళ్లి దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. నిర్మానుష్య ప్రాంతంలో స్పృహ కోల్పోయి ఉన్న మహిళను గుర్తించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. స్థానికంగా నివాసం ఉండే రకీబ్, సోహైల్, రస్సెల్ అనే ముగ్గురు వ్యక్తులు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు పేర్కొంది. వారు తనను తీవ్రంగా హింసించి గాయపరిచినట్లు తెలిపింది.ఇప్పటి వరకు పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాలు, మానవ హక్కుల కార్యకర్తలు నిరసనలకు దిగారు.

## తమినాడులో సర్ ప్రక్రియ పూర్తి

- రాష్ట్రంలో 74 లక్షల మంది ఓటర్ల తొలగింపు
- తుది జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం

చెన్నై, ఫిబ్రవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )

తమిళనాడు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియ పూర్తికావడంతో తుది జాబితాను ఎన్నికల సంఘం సోమవారంనాడు విడుదల చేసింది. సవరించిన జాబితా కింద రాష్ట్రంలోని 74 లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి ఈసీ తొలగించింది. మొత్తం 5.67 కోట్ల మంది ఓటర్ల బాజితాలో చోటుచేసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు ముందు 6.41 కోట్ల మంది రిజిస్టర్డ్ ఓటర్లు ఉన్నారు. సోమవారంనాడు చెన్నైలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తమిళనాడు చీఫ్ ఎలక్షన్ అధికారి అర్చనా పట్నాయక్ ఈ జాబితాను విడుదల చేశారు. తాజా జాబితాలో 5.67 కోట్ల మంది ఓటర్లు నమోదు కాగా,

-మిగతా 2 లో

## నేడు, రేపు వర్షసూచన

- ఈదురుగాలులతో కూడిన వర్షం
- పలుచోట్ల రైతుల హర్షం
- కొన్నిచోట్ల నేలకొరిగిన పంటలు



హైదరాబాద్, ఫిబ్రవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రేస్

రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారింది. పలు జల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. నైరుతి బంగాళా ఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం వల్లే వర్షాలు కురుస్తున్నట్టు వాతావరణ శాఖ అధికారులు వెల్లడిం చారు. సోమవారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, కాచిగూడ సహా పలుచోట్ల

-మిగతా 2 లో

## కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

- జమ్మూకశ్మీర్ లోని కిస్ట్‌వార్ జిల్లా లో భద్రతాబలగాలకు, ఉగ్రవాదులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్
- ముగ్గురు జైషే ఉగ్రవాదుల హతం
- మంచుతో నిండిన ఛత్రూ అడవుల్లో ఓ కొండ దిగువన గల మట్టి ఇంట్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న కచ్చితమైన సమాచారం అందుకున్న భద్రతాబలగాలు.
- ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ఆ స్థావరాన్ని చుట్టుముట్టాయి



శ్రీనగర్,

జమ్మూకశ్మీర్ లోని కిస్ట్‌వార్ జిల్లా లో భద్రతాబలగాలకు, ఉగ్రవాదులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ కోసం పనిచేస్తున్నారని భద్రతాబలగాలు గుర్తించాయి. మంచుతో నిండిన ఛత్రూ అడవుల్లో ఓ కొండ దిగువన గల మట్టి ఇంట్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న కచ్చితమైన సమాచారం అందుకున్న భద్రతాబలగాలు.. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ఆ స్థావరాన్ని చుట్టుముట్టాయి. భద్రతాబలగాలు లొంగిపోవాలని హెచ్చరించగా.. తొలుత ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దాంతో భద్రతాబలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఆ ఇంట్లో దాగి ఉన్న ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతి చెందిన ఉగ్రవాదుల్లో కరుడుగట్టిన ఉగ్రవాది, జేఈఎం కమాండర్ సైఫుల్లా కూడా ఉన్నట్టు అనుమానిస్తున్నారు.

## కామారెడ్డిలో తగ్గని ఉద్రిక్తత

- ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి అస్వస్థత



కామారెడ్డి, ఫిబ్రవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రేస్

ఓవైపు కామారెడ్డిలో ఉద్రిక్తత కొనసాగుతున్న వేళ,కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకట రమణారెడ్డి సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గత రెండు మూడు రోజులుగా కామారెడ్డి లో కొనసాగుతున్న రాజకీయ పరిణామాల ఒత్తిడి నేపథ్యంలో ఆయన జ్వరంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆయన పోలీసుల బందోబస్తు నడుమ గృహ నిర్భంధంలో ఉండగా.. డాక్టర్లు ఆయన ఇంటికి వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షలు చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో భూ వివాదానికి సంబంధించి జరుగుతున్న గొడవ.. సవాళ్లు, ప్రతి సవాళ్లకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే ఆరోగ్యంపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు.

-మిగతా 2 లో

# ఎవరిపైనో వేటు?

మొదటి తరువాయి

అతడి ఆటలో ఆత్మవిశ్వాసం లోపించింది. ఒకవేళ కుడి చేతివాటం బ్యాటర్ సంజూతో ఓపెనింగ్ చేయిస్తే తిలక్‌ను తప్పించి.. అతడి స్థానంలో అభిషేక్‌ను చాన్సిస్తే ఎలా ఉంటుందనే వ్యూహంపై కూడా జోరుగా చర్చసాగుతోంది. కానీ, శాంసన్ వరుస వైఫల్యాల కారణంగానే కిషన్‌ను ఓపెనింగ్‌కు పంపాల్సి వచ్చిందనే విషయాన్ని గమనించాలి. మెగా టోర్నీలో ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ ఓపెనర్లలో ఒకరు డకౌట్ కావడంతో.. ఆ ఒత్తిడి మిగతా బ్యాటర్లపై పడుతోందని డష్కాటే చెప్పాడు. సూర్యకుమార్, దూబేల ఆట నిరాశపర్చినా.. అభిషేక్, తిలక్ వైఫల్యాలను వెనకేసుకు రాలేమన్నాడు. ఫినిషర్‌గా రింకూకు తగిన అవకాశాలు లభించలేదనే అభిప్రాయం వ్యక్తం చేశాడు. జింబాబ్వేతో మ్యాచ్‌లో పూర్తిస్థాయిలో సత్తాచాటడమే జట్టుముందున్న ఏకైక లక్ష్యమని పేర్కొన్నాడు. అక్షర్‌కు బదులు సుందర్‌కు అవకాశం కల్పించడం వ్యూహాత్మకమేనని తెలిపాడు. కాగా, అక్షర్‌ను తప్పిస్తున్నట్టు కోచ్, కెప్టెన్ ముందుగానే సమాచారం ఇచ్చారని కోటక్ చెప్పాడు.

# వికసిత బెంగాల్ బాధ్యత నాది

మొదటి తరువాయి

అన్నారు. జై మహాకాళి' అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. 'మరి కొద్ది నెలల్లోనే బెంగాల్ భవిష్యత్తు నిర్ణయం కోబోతోంది. మీరు తీసుకునే తెలివైన నిర్ణయం పైనే భావితరాల భవిష్యత్తు, దిశానిర్దేశర ఆధారపడి ఉంటుంది. సోనార్ బంగ్లా కోసం యువకులు, పెద్దలు, మహిళలు కన్న కలలు కల్లలుగా మిగిలిపోతున్న పరిస్థితి ఇవాళ ఉంది. వారి బాధలు నన్ను కలిచివేస్తున్నాయి. ఇందుకోసం హృదయపూర్వకంగా ఒక తీర్మానం చేసుకున్నాను. వికసత్ బంగ్లా సాధనకు నిర్ణయం తీసుకున్నాను' అని ఆ లేఖలో మోదీ పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీస్సుల బలంతో ప్రజాసంక్షేమానికి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం పాటుపడిందని, రైతుల సంక్షేమం నుంచి యవత కలల సాకారం, మహిళా సాధికారత వరకూ కృషి చేసిందని చెప్పారు. ప్రభుత్వ విధానాల వల్ల సాధించిన సానుకూల ఫలితాలను ఇవాళ ప్రజలు చూస్తున్నారని అన్నారు. బెంగాల్ అభివృద్ధి విషయంలో మమతాబెనర్జీ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోందని మోదీ ఆ లేఖలో విమర్శించారు. అయినప్పటికీ ప్రజాసంక్షేమానికి కట్టుబడి కేంద్రం ముందుకు వెళ్తోందన్నారు. 'జన్-ధన్ యోజన'తో పశ్చిమబెంగాల్‌లోని సుమారు 5 లక్షల మందికి బ్యాంకు అకౌంట్లు తెరిచామని, స్వచ్ఛభారత్ అభియాన్ కింద 85 లక్షల టాయిలెట్లను రాష్ట్రంలో నిర్మించామని చెప్పారు. చిన్న వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రూ.2.82 లక్షల కోట్లు రుణాలిచ్చామని, 56 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు అటల్ పెన్షన్ యోజన కింద లబ్ధి చేకూర్చామని, ఉజ్వల్ యోజన కింద కోటికి పైగా ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించామని వివరించారు.'నేతాజీ సుభాష్ చంద్రబోస్ పుట్టిన గడ్డలో ఇవాళ అక్రమ చొరబాట్లు, మహిళలపై హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రబీంద్రనాథ్ ఠాగూర్ కలలుకన్న సోనార్ బంగ్లా ప్రమాదంలో పడింది. ఇవాళ బెంగాల్ పూర్వ గౌరవాన్ని పునరుద్ధరించాలి. మార్పు అనివార్యం. బెంగాల్ అభివృద్ధి ప్రయాణంలో అంతా కలిసిరావాలి. 2026లో వికసిత్ వెస్ట్ బెంగాల్ కోసం ప్రతినబూనుదాం' అని మోదీ ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

# అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

మొదటి తరువాయి

ఈ శిక్షణ కార్యక్రమాన్ని 2026 మార్చి నుంచి శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో అకాడమీలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సదన్‌లో ఉంటున్న అనాథ యువతకు ఉద్యోగ అవకాశాల లక్షంగా శిక్షణ ఇవ్వనున్నారు. పాలిటెక్నిక్ చదువుతున్న అనాథ అమ్మాయిలకు ఫిక్కి నిర్వాహకులు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. చదువుకునే కాలంలోనే ఇండ్రస్టీ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ టీచర్లకు ఫ్రీ స్కూల్ ట్రైనింగ్ శిక్షణ కోసం అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. అంగన్వాడీ టీచర్లకు ఇంగ్లిష్‌పై శిక్షణ, పాలన కేంద్రాల్లో చిన్నారులకు అందిచాల్సిన సేవలపై శిక్షణని అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీ ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అనాథ పిల్లల సంరక్షరణ ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు. వారికి కేవలం ఆశ్రయం కాదని, భవిష్యత్తు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి వారిని స్వతహగా ఎదిగేలా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించారు. మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి లక్ష్యాలతో రూపొందించిన ఈ కార్యక్రమం ప్రభుత్వం-పరిశ్రమల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పుకొచ్చారు. సమగ్ర పునరావాసం, శిక్షణ, ఉపాధి కల్పనలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్య అనాథ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపే మార్గదర్శక నిర్ణయంగా నిలవనుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# తమినాడులో సర్ ప్రక్రియ పూర్తి

మొదటి తరువాయి

వీరిలో 2.77 కోట్ల మంది పురుషులు, 2.89 కోట్ల మంది మహిళలు 7,617 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. ÷-లకెయిమ్‌లు, అబ్జెక్షన్ పీరియడ్‌లో దాఖలు చేసిన దరఖాస్తులను సమీక్షించి మార్పులు చేసినట్టు ఎన్నికల కమిషన్ తెలిపింది. 2025 డిసెంబర్ 19 నుంచి 2026 జనవరి 30 వరకూ ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించాల్సిందిగా 4.38 లక్షల అప్లికేషన్లు వచ్చాయని, వీటిలో 4.23 లక్షల ఎంట్రీలను వెరిఫికేషన్ అనంతరం తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించామని పేర్కొంది., తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఈ వేసవి సీజన్‌లోనే జరగనున్నాయి. కేరళ, పశ్చిమబెంగాల్, పుదుచ్చేరి, అస్సాం ఎన్నికలు కూడా ఇదే పీరియడ్‌లో జరగాల్సి ఉన్నాయి.

# ఇండియా కూటమిలో నాయకత్వ మార్పు?

మొదటి తరువాయి



ఈ ప్రతిపాదనకు ఆ పార్టీలోని కొందరు సభ్యులు మద్దతు తెలుపగా, కాంగ్రెస్ ఉన్నత వర్గాలు మాత్రం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ పదవి చేపట్టాలంటూ పలు పార్టీల నేతలు సూచించిన కొన్ని వారాల తర్వాత తాజాగా స్టాలిన్ పేరు తెరపైకి వచ్చింది.

స్టాలిన్ అయితే బెటర్

కూటమికి స్టాలిన్ నాయకత్వం వహించడం మేలు చేస్తుందని మణిశంకర్ అయ్యర్ సోమవారం పేర్కొన్నారు. 'ఒక్క తమిళనాడు సీఎం మాత్రమే 2029 ఎన్నికల్లో కూటమికి విజయాన్ని చేకూర్చగలరు' అని ఆయన గట్టిగా నొక్కి చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో 2029 ఎన్నికల లక్ష్యాన్ని సాధించడానికి దళపతి స్టాలిన్ కన్నా సరిగ్గా సరిపోయే నేత ఎవరూ లేరని ఆయన స్పష్టం చేశారు. అయితే ఇండియా కూటమి మనుగడకు మమతా బెనర్జీ కేంద్ర బిందువు అని అన్నారు. ఊరికే ఆ పదవిని పట్టుకుని ఉండకుండా జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ చిన్న పార్టీలకు చెందిన ఎంకే స్టాలిన్, మమతా దీదీ, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్ లేదా మరొకరికో ఆ పదవిని అప్పగించాలని సూచించారు.

మా నాన్నే సమర్థుడు

బీజేపీపై పోరాటానికి తమ పార్టీ అధినేత స్టాలినే నేతృత్వం వహించాలని డీఎంకే డిమాండ్ చేసింది. తమిళనాడులో కాంగ్రెస్ మిత్రపక్షంగా కొనసాగుతున్న డీఎంకే.. ఇండియా కూటమి నాయకత్వ మార్పును కోరుకుంటున్నది. పలు రాష్ట్రాలకు చెందిన నేతలు కూడా తన తండ్రి ఎంకే స్టాలిన్ కూటమికి నేతృత్వం వహించాలని కోరుతున్నారని ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారు. రాజకీయాల్లోనూ, ప్రజాపాలనలోనూ స్టాలిన్ ఒక ఉదాహరణగా నిలుస్తున్నారని ఆయన అన్నారు.

నాయకత్వ మార్పు జరగాల్సిందే

వరుస ఓటములతో కుదేలైన ఇండియా కూటమి ప్రస్తుత నాయకత్వాన్ని మార్చాల్సిందేనని పలు పార్టీలు తెగేసి చెబుతున్నాయి. నాయకత్వ మార్పునకు సంబంధించి అన్ని పార్టీలు చర్చలు జరపాల్సిన అవసరాన్ని శివసేన (యూబీటీ) ఉద్ఘాటించింది. 'కూటమిని ఏలేది స్టాలినా, మమతా బెనర్జీయా లేక మరొకరా అన్నది తర్వాత.. ముందు నాయకత్వ మార్పు గురించి కూటమిలో చర్చ జరగాలి' అని శివసేన పార్టీకి చెందిన సామ్నా ఎడిటోరియల్ ప్రశ్నించింది. కాగా, నాయకత్వ మార్పునకు సంబంధించి ఇంతవరకూ ఎలాంటి సమావేశం జరగలేదని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. మణిశంకర్ అయ్యర్ తన వ్యక్తిగత అభిప్రాయాన్ని చెప్పారని అది తప్పు కాదన్నారు.

# మే 11 నుంచి జనగణన

మొదటి తరువాయి



సమాచారం. ఈ ఎన్నికలు రద్దు చేస్తారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గానికి స్పష్టత ఇచ్చారు. సంబంధిత శాఖ అధికారులతో ఈ అంశంపై మాట్లాడేటప్పుడు కేంద్రం నుంచి జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఎలాంటి నిధులు రానప్పుడు వారి పరిస్థితి, ప్రాబల్యం, ఉనికి ఏంటి అనే అంశాలపై చర్చ జరిగిందేతప్ప, వాటిని ఎత్తివేయాలనే చర్చే జరగలేదని వివరించినట్టు సమాచారం. దీనిపై స్పందించిన కొందరు మంత్రులు ఈ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని అభిప్రాయం వ్యక్తంచేయగా, మరికొందరు మంత్రులు ప్రతిపక్షపార్టీలు కొన్ని చోట్ల బలంగా ఉన్నాయనీ, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీలు చెప్పుకోదగిన స్థాయిలో స్థానాల్ని గెలుచుకున్నాయని గుర్తుచేశారు. రైతుబంధు, స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి వాటికి నిధులు విడుదలచేసి ఎన్నికలకు వెళ్తే బాగుంటుందని మరికొందరు మంత్రులు అభిప్రాయాలు వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ విద్యార్థులకు మార్చి, ఏప్రిల్ నెలల్లో వరుసగా పరీక్షలు ఉన్నాయనీ, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ జనగణన ఉందనీ, అవన్నీ పూర్తి అయ్యాక ఆగస్టులో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు వెళ్దామని చెప్పి, ఆ చర్చను ముగించినట్టు సమాచారం. అనంతరం రైతు భరోసా కోసం రూ.4వేల కోట్ల నిధుల విడుదలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రివర్గ నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకరులకు వివరించారు. పక్కన మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి కూడా ఉన్నారు.

**మెట్రోకోసం మంత్రివర్గ ఉపసంఘం**

హైదరాబాద్ మెట్రోరైల్‌ను ఎల్‌అండ్‌టీ సంస్థ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకొనేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించాలని సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటికే దీనిపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం స్వాధీన ప్రక్రియను పర్యవేక్షించడానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా ఉపసంఘాన్ని నియమించారు. ఎల్ అండ్ టీతో జరిగిన ఒప్పందంలో రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా చెల్లించి, రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకునేలా అవగాహనకు వచ్చిన విషయాన్ని సీఎం మంత్రులకు వివరించారు. మెట్రోరైల్ ఆస్తులు, వాటి విలువను ఇండిస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ) పెట్టుబడి మదింపును చేసిందనీ, మెట్రో రైళ్లు, ట్రాక్‌లు, సిగలింగ్ వ్యవస్థ వంటి సాంకేతిక అంశాలను మదింపు చేసి ఢిల్లీ మెట్రోరైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) ప్రాథమిక నివేదికలు ఇచ్చాయి. వీటిపై మంత్రివర్గంలో చర్చించారు.

మే 11 నుంచి జనగణన

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జనగణన-2027ను చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లపై మంత్రివర్గం చర్చించింది. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తొలి విడత జరిగే ఇండ్ల గణన (హౌజ్ లిస్టింగ్ ఆపరేషన్) రాష్ట్రంలో మే 11వ తేదీన ప్రారంభించి జూన్ 9 వరకు చేపడుతున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు మంత్రివర్గానికి వివరించారు. హౌజ్ లిస్టింగ్‌కు కేంద్రం నిర్దేశించిన 34 ప్రశ్నల నమూనాను చెప్పారు. జనగణన కోసం రాష్ట్రంలో ఎన్యుమరేటర్లతో పాటు నోడల్ ఆఫీసర్లు సహా దాదాపు 89 వేల మంది ఉద్యోగులు ఈ ప్రక్రియలో భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. రెండో దశ జనగణన ప్రక్రియను 2027 ఫిబ్రవరిలో చేపడతామన్నారు. దీనికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**ప్రభుత్వోద్యోగులకు ప్రమాదబీమా**


రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచితంగా ప్రమాద బీమా పథకం వర్తింపచేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. దీనికోసం ఉద్యోగులు, పెన్షనర్లు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. దీన్ని తొలివిడతలో సింగరేణి కాలరీస్, ట్రాన్స్‌కో ఉద్యోగులకు వర్తింపచేశారు. అక్కడ ఈ పథకం విజయవంతమైంది. దానితో ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ ప్రమాదబీమాను అమలు చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించారు. ఎవరైనా ప్రమాదంలో మరణిస్తే సదరు ఉద్యోగి కుటుంబానికి ఒక కోటి 2లక్షల రూపాయల ప్రమాద బీమా పరిహారం అందుతుంది. సహజ మరణానికి 60 ఏండ్ల వరకు ఉద్యోగులకు రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వ కార్పొరేషన్లు. ప్రభుత్వ రంగ సంస్థల పరిధిలో 5 లక్షల 19 వేల మంది రెగ్యులర్ ఉద్యోగులున్నారు. వీరితో పాటు 2 లక్షల 38 వేల మంది పెన్షనర్లు ఉన్నారు. మొత్తం 7.57 లక్షల మందికి ఈ ప్రమాద బీమా వర్తిస్తుంది.

**వైద్య విధాన పరిషత్ అప్‌గ్రేడ్**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ)ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (డీఎస్‌హెచ్)గా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. దీంతో పూర్తిస్థాయి ప్రభుత్వ విభాగ హోదా లభిస్తుంది. నిధుల కేటాయింపులో ప్రాధాన్యం పెరుగుతుంది. సర్జికల్స్, మెడిసిన్స్ కొనుగోలు వేగంగా జరుగుతుంది. డాక్టర్లు, సిబ్బందికి సకాలంలో వేతనాలు అందడంతో వైద్య సేవలు మెరుగుపడుతాయని క్యాబినెట్ భావించింది.

# నేడు, రేపు వర్షసూచన

మొదటి తరువాయి



చిరుజల్లులు కురిశాయి. మెదక్ జిల్లా తొగుట మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో మండలంలోని ఘనపూర్, గుడికందుల, వరదరాజుపల్లి, వెంక ట్రావుపేట తదితరగ్రామాల్లో పొద్దు తిరుగుడు, మొక్కజొన్న పంటలు నేల కొరిగినట్టు సమాచారం. కామారెడ్డి జిల్లా పిట్టం, అసిఫాబాద్ జిల్లా జైనూర్, సిర్పూర్, తలమడుగు, ఆదిలాబాద్‌లోనూ చిరుజల్లులు కురిశాయి. కాగా, మంగళవారం, బుధవారం అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# కామారెడ్డిలో తగ్గని ఉద్రిక్తత

మొదటి తరువాయి

అయితే మరికొన్ని రోజుల పాటు ఆయనకు విశ్రాంతి అవసరమని సూచించారు. ఇదిలావుంటే కామారెడ్డిలో ఉద్రిక్త పరిస్థితి కొనసాగుతోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతల మధ్య సవాళ్ల నేపథ్యంలో స్థానికంగా హైటెన్షన్ వాతావారణం నెలకొంది. సోమవారం జిల్లా కలెక్టర్‌తో బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి భేటీ కావాలనున్నారు. తనపై చేసిన ఆరోపణల నేపథ్యంలో అందుకు సంబంధించిన సాక్ష్యాలు తీసుకురావాలంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను కాంగ్రెస్ నేతలు స్వీకరించారు. అందుకు సంబంధించిన సాక్ష్యాలను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. మరోవైపు డిగ్రీ కాలేజీ భూముల విషయంలో తాను అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని వెంకట రమణారెడ్డి ప్రకటించిన విషయం విదితమే. రాజీనామాకు సిద్ధం కావాలంటూ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూములపై స్పష్టత ఇవ్వాలంటూ అధికారులను బీజేపీ డిమాండ్ చేసింది. ఇలా ఇరు పార్టీనేతల విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడంతో కామారెడ్డిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నేపథ్యంలో పోలీసులు వెంటనే అలర్ట్ అయ్యారు. ఇరు పార్టీల నేతలను కలెక్టర్ కార్యాలయానికి పోలీసులు వెళ్లనిస్తారా? లేదా? అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. బీజేపీ ఎమ్మెల్యేకు మద్దతుగా కామారెడ్డి వెళ్లేందుకు యత్నించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావును పోలీసులు ఆదివారం హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకుని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కామారెడ్డి వెళ్తుండగా.. ఆయన్నూ పెద్దశంకర్‌పేట వద్ద అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన విషయం విదితమే.

# 765 కేవి హైటెన్షన్ వైర్ల బాధిత రైతులను ఆదుకోవాలి

**-కడ్తాల్ రైతులతో కలిసి కందుకూరు ఆర్డీఓకు వినతిపత్రం**
**-సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి**




**కడ్తాల్, ఫిబ్రవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
రైతుల పొలాల గుండా 765 కేవి హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు,తీగలు వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం, పలు గ్రామాల మీదుగా 765కేవి బీదర్ - మహేశ్వరం నూతన విద్యుత్ లైన్ ఏర్పాటుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. హైటెన్షన్ విద్యుత్ తీగల ఏర్పాటుతో నష్టపోతున్న రైతులకు న్యాయం చేయాలని సోమవారం రైతులతో కలిసి కందుకూరు రెవెన్యూ డివిజినల్ అధికారి జగదీశ్వర్ రెడ్డికి కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటుతో వ్యవసాయ భూముల వినియోగాన్ని ప్రభావితం చేస్తుందని, పంట ఉత్పత్తిపై కూడా ప్రభావం చూపుతుందని అన్నారు. కడ్తాల్ గ్రామం శరవేగంగా అభివృద్ధి చెందుతుందడంతో గ్రామానికి సమీపాన విద్యుత్ లైన్ ఏర్పాటుతో అభివృద్ధి ఆగిపోతుందని తెలిపారు. ఈ మేరకు రైతులకు న్యాయం చేసే విధంగా పై అధికారులకు నివేదిస్తానని ఆర్డీఓ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటుతో రైతులు తమ పొలాలను వ్యవసాయానికి వినియోగించుకోకపోగా, క్రయవిక్రయాలకు కూడా వీలు లేకుండా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హై టెన్షన్ స్తంభాలు మరియు విద్యుత్ తీగల ఏర్పాటుతో నష్టపోతున్న రైతులకు న్యాయం జరిగేంతవరకు రైతుల పక్షాన పోరాడతామని, రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ ,వార్డు సభ్యులు ఎర్రోళ్ల రాఘవేందర్,బీసీ సంఘం కడ్తాల్ అధ్యక్షుడు పిప్పల్ల వెంకటేష్, గుదే రాములు యాదవ్,గూడూరు శేఖర్ రెడ్డి,గూడూరు పెంటారెడ్డి,క్యాతిక కేశవులు, కందికంటి శ్రీరాములు, గుదే పర్వత్ కుమార్ యాదవ్, గోరేటి శ్రీశైలం,గోరేటి చంద్రశేఖర్,జంగయ్య,యాదయ్య, కేశవులు,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రజక కుటుంబంపై దాడి చేసిన వారిని శిక్షించాలి

**- బిజెపి జిల్లా దళితమోర్చ ఉపాధ్యక్షులు నింగ్యారి యాదగిరి**



**కడ్తాల్, ఫిబ్రవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
ఈనెల 18న నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో జరిగినటువంటి రజక కుటుంబంపై అగ్ర కులాల నాయకులు జరిపిన దాడిని ఖండిస్తున్నమని బీజేపీ జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షుడు నింగ్యారి యాదగిరి అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..దేశానికి స్వతంత్రం వచ్చి సుమారు 79 సంవత్సరాలు అవుతున్న ఎస్సీ ఎస్టీ బీసీ కులాల మీద దాడులు ఆగడం లేదని రజక కులానికి చెందినటువంటి ఒక ఫ్యామిలీ రెండు నెలల బాలింత చిన్న పాప తోటి దర్శనానికి వెళ్తే అగ్రకులానికి చెందిన కాంగ్రెస్ రెడ్డి నాయకులు 100 రూపాయల టికెట్ తేవాలని తో చేయడం జరిగింది టికెట్ ఎందుకని అడిగినందుకు ఆ ఫ్యామిలీని కొబ్బరికాయల రూమ్ లో పడేసి స్త్రీలు అని చూడకుండా ఇష్టానుసారంగా శారీరకంగా చిత్ర హింసలు పెడుతుంటే ఆ బాలింత ఆ చిన్న పాపను చూపిస్తే మమ్ములను వదిలేస్తారు అనుకోని ఆ చిన్న పసికందు ను చూయించింది కనికరం లేని రాక్షసులు రెండు నెలల చిన్న పసిపాపను కాలితో తన్ని చంపేయడం జరిగింది. ఇదంతా జరిగినంక కూడా పోలీస్ డిపార్ట్మెంట్ గాని ఈ రాష్ట్ర ప్రభుత్వం అధికారులు కానీ ఎవరు పట్టించుకోలేకపోయారు.

రాష్ట్రంలో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే ఎవరైతే రెడ్డిలు అగ్రకులానికి చెందిన నాయకులు ఈ యొక్క పసికందు బిడ్డ చావుకు మరియు ఆ కుటుంబాన్ని హింసించడానికి కారకులు ఎవరైనా సరే వారిని అరెస్టు చేసి తక్షణమే శిక్ష అమలుపరచాలన్నారు.ఆ యొక్క రజక కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించి ఈ యొక్క రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల భారతీయ జనతా పార్టీ తరపున ఆందోళన తప్పదన్నారు.

# శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి

**- ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి.**
**- మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.**



**దేవరకొండ,ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రతి ఒక్కరు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం డిండి మండలం దాసరినెమిలిపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 39వ బ్రహ్మోత్సవాల సందర్భంగా మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ,.ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి అని ఆయన అన్నారు.దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని అయన తెలిపారు.ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని అయన అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర్ రావు,మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి సుభాష్, స్థానిక సర్పంచ్ షేక్ రఫియాబషీర్, మాజి కో- అప్షన్ సభ్యులు జంగిర్, ఉప సర్పంచ్ రాం రెడ్డి,గంగిడి నరేందర్ రెడ్డి,బొడ్డుపల్లి కృష్ణ,లక్ష్మణ్, రామచంద్రం,బషీర్,శ్రీధర్, హనుమంత్, భగవంతు,తదితరులు పాల్గొన్నారు.

# రజాకారుల రాజ్యమా ఇది రౌడీ రాజ్యమా

**- మంతుర్తి శ్రీకాంత్ యాదవ్**



**హుస్నాబాద్ , ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎల్కతుర్తి మండల బీజేపీ అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేతలు తక్కువ జాతి ఓట్లు కావాలని కోరుకుంటారు కానీ తక్కువ జాతి ప్రజల పట్ల కనీసమైన గౌరవం చూపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.నాగర్‌కర్నూల్‌లో కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన ఘటనలో పసిపాప మరణానికి కారణమైన నిర్వాహకులను, అధికారులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు చెందిన సర్పంచ్ తుకారాం రెడ్డి కులాహంకారంతో తక్కువ జాతి ప్రజలను గదిలో బంధించి కొట్టడం, రెండు నెలల పాపను కాళ్లతో తన్నడం వల్ల పాప మరణించిందని ఆయన ఆరోపించారు.కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు లేకపోవడమే కాకుండా ఇప్పుడు కుల వివక్ష కూడా పెరిగిపోతుందని విమర్శించారు. ఇలాంటి వ్యక్తులను బాధ్యత గల పదవుల నుండి తొలగించి, కఠిన శిక్షలు విధించాలని, ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. కుల వివక్ష లేకుండా అందరూ కలిసి మెలిసి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# నిరుద్యోగ యువతీ యువకులు స్వయంకృషితో రాణించాలి

**-డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా**



**కడ్తాల్, ఫిబ్రవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
నిరుద్యోగ యువతీ యువకులు తల్లిదండ్రులపై ఆధారపడకుండా తమ కాళ్లపై నిలబడి స్వయంకృషితో తమకు నచ్చిన రంగాలలో రాణించాలని డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. సోమవారం కడ్తాల పట్టణంలో సురేష్, సతీష్ లు ఏర్పాటు చేసుకున్న మొబైల్ షాప్, పూజ స్టోర్ ఫ్లవర్ దుకాణాలను ఆయన చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న యువత డ్రగ్స్, మత్తు పానీయాలకు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. యువత ఒకరిపై ఆధారపడకుండా స్వయంకృషితో ఎదిగినప్పుడే దేశం అభివృద్ధిలో పయనిస్తుందని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు రాలేదని నిరాశ చెందకుండా తమలో ఉన్న ప్రతిభను వెలికి తీసి స్వయంకృషితో ఎదగాలని అన్నారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ముత్తు కృష్ణ, కొప్పు కృష్ణ, సురేష్, అంజి, శ్రీకాంత్, యూత్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు వి వీరేందర్ గుప్తా, ఒగ్గు మహేష్ జగదీష్, శ్రీకాంత్, రేణు తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపిన పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీఆర్ఎస్ పార్టీపై నమ్మకంతో 8 మంది కౌన్సిలర్లను గెలిపించిన ఆమనగల్లు ప్రజలకు 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము కృతజ్ఞతలు తెలిపారు.సోమవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, "బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, నిరంతరం ప్రజల మధ్య ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. అధికారపక్షం బీజేపీ, కాంగ్రెస్ చేసే తప్పులను గుర్తించి నిలదీయాలి. ప్రజల పక్షాన నిలిచి పోరాటాలు చేయాలి" అని అన్నారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఉన్న విశ్వాసంతో ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, ఆ విశ్వాసాన్ని వమ్ము చేయకుండా ప్రజా విశ్వాసాన్ని చూరగొనాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు వదిలిపెట్టొద్దని పిలుపునిచ్చారు.ప్రజలు అధికార పార్టీ ప్రలోభాలకు తలొగ్గకుండా బీఆర్ఎస్‌ను ఆదరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పంచాయతీ కార్యదర్శి పై చర్యలకు యువకుల డిమాండ్



**మనోహరాబాద్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మనోహరాబాద్ మండల కేంద్రంలో సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ చీర్ల అనూష భాస్కర్ యాదవ్ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది.ఈ సందర్భంగా గ్రామంలోని యువకులు పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ, "గ్రామ సమస్యలను పట్టించుకోవడం లేదు. స్థానిక పరిశ్రమలో ట్యాక్స్ కలెక్షన్ విషయంలో అవకతవకలు జరుగుతున్నాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు" అని ఆరోపించారు.గ్రామ సభలో ఈ అంశంపై తీర్మానం చేయడంతో పాటు పలు సమస్యలపై చర్చ జరిగింది.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీర్ల అనూష భాస్కర్ యాదవ్, ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి, అధికారులు, యువకులు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మనోహరాబాద్‌లో బస్ స్టాండ్ నిర్మాణం చేయాలని మంత్రిని కోరిన సర్పంచ్



**మెదక్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మనోహరాబాద్ మండల కేంద్రంలో బస్ స్టాప్, బస్ స్టాండ్ నిర్మాణం చేయాలని గ్రామ సర్పంచ్ చీర్ల అనూష భాస్కర్ యాదవ్ తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి కొనసాగుతున్నప్పటికీ, ఇప్పటికీ గ్రామానికి బస్ స్టాప్ లేకపోవడం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది. అందుకే బస్ స్టాండ్ నిర్మాణం అత్యవసరం" అని తెలిపారు. కార్యక్రమంలో విఠల్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రూ. 10లక్షలతో మహిళా సమైక్య భవనంకు భూమిపూజ



**కడ్తాల్, ఫిబ్రవరి 23 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
గానుగుమర్ల తండా పంచాయితీలోని పోచమ్మ గడ్డ తండాలో రూ. 10లక్షల వ్యయంతో నిర్మిస్తున్న గ్రామ సమాఖ్య సంఘ భవన నిర్మాణ పనులకు సర్పంచి సేవ్య నాయక్, ఉప సర్పంచి లక్పతి నాయక్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తండా అభివృద్ధి కి అన్ని రంగాల్లో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హన్మ నాయక్, దశరథ్ నాయక్, టిక్ లాల్, శ్రీను నాయక్, రాజు, పాండు నాయక్, మొత్య నాయక్, రాజు నాయక్, సేవ్య నాయక్, లక్ష్మణ్ నాయక్, బిక్యా, సక్రు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ



**కల్వకుర్తి, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. సోమవారం నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల భర్త ఆనంద్ కుమార్, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్ మర్యాదపూర్వకంగా మంత్రి జూపల్లిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "కల్వకుర్తి పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా మున్సిపాలిటీ పనులు వేగవంతం చేయాలి" అని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు భూపతిరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల

**కల్వకుర్తి, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మున్సిపాలిటీ 7వ వార్డులో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ, "నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఎల్లప్పుడూ బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేస్తాం" అని తెలిపారు.



# పసి బిడ్డను హత్య చేసిన అగ్రకుల దురహంకారులను కఠినంగా శిక్షించాలి

- హంతకులందరిని 24 గంటలలోపే అరెస్టు చేయాలి
- హత్య నేరం కింద కేసు నమోదు చేయాలి.
- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను.



**హాలియా, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రెండు నెలల పసిబిడ్డను అత్యంత క్రూరంగా అమానవీయంగా కాలితో తన్ని హత్య చేసిన ఆ గ్రామ అగ్రకుల పెత్తందారులు శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కన్నిరెడ్డి, మరికొందరిపై ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంతోపాటు హత్యా నేరం కింద కేసు నమోదు చేసి 24 గంటల్లో తక్షణమే రిమాండ్ చేయాలని హాలియ కేంద్రంలో సోమవారం కేవిపియస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలియజేశారు ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న నేటికీ దళిత, గిరిజన, మైనార్టీ, బడుగు బలహీన వర్గాలపై దాడులు, హత్యలు అత్యాచారాలు, సాంఘిక బహిష్కరణలు కొనసాగుతున్నాయని, పండగలు ఉత్సవాలలో కులవివక్ష అగ్రకుల దురహంకారంతో ప్రజల మధ్య కులవిద్వేషాలు సృష్టించడం, దేవుడి దగ్గర అందరూ సమానము కాదని అహంకారము ప్రదర్శించడంవల్ల ఈ ఘటన జరిగిందన్నారు, దేవుని దగ్గరికి వెళ్లడానికి 100 రూపాయలు ఫీజు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించిన పాపానికి, చెల్లిస్తాం కానీ రశీద్ ఇవ్వండని అడిగినందుకు సుమారు మూడున్నర గంటలపాటు గణేష్ అనే యువకుడిని చితక బాధారని చెప్పారు. తన భర్తను కొట్టవద్దని తన తమ్ముడిని కొట్టవద్దని గణేష్ అక్క కీర్తి భార్య మౌనిక ఎంతగా బ్రతిమిలాడిన కాళ్లు మొక్క డానికి ప్రయత్నం చేసిన కాళ్లతో తన్నారు తప్ప కనికరించలేదు రెండు నెలల పసిబిడ్డ ఉంది నా భర్తను కొట్టకండి చంపకండి అని వేడుకున్న చివరికి ఏమాత్రం కనికరం లేకుండా అమానవీయంగా మానవ మృగంలా రెండు నెలల పసిబిడ్డపై కూడా కాలితో తన్ని క్రూరంగా పసిబిడ్డను హత్య చేశారని చెప్పారు. ఈ ఘటన సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా మానవత్వాన్ని మంటగలిపే విధంగా ఉందన్నారు సంఘటన ఈ నెల 18న జరిగితే పోలీసులు బాధితులే అగ్రకుల పెత్తందారులపైన దాడి చేసినట్లుగా బాధితులపై కేసులు నమోదు చేయడం సిగ్గుచేటు అన్నారు. బాధితులను వెంటబడి వెంబడించి దాడి చేసి చెప్పరాని బూతులు తిట్టి కాలుతో తన్ని పసిబిడ్డను హత్య చేసిన హంతకులను మాత్రం పోలీసులు ఒక కంటకనిపెట్టారని చెప్పారు, చట్టం ముందు అందరూ సమానులే అని చెప్పే పోలీసులు హంతకులకు న్యాయం బాధితులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు బాధితులకు న్యాయంచేసే క్రమంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. డిఎస్పీ శ్రీనివాస్ ముందు హంతకులపై కేసు నమోదు చేయాల్సి ఉండగా బాధితులపై కేసు పెట్టారని చెప్పారు. 8 మందిపై ఫిర్యాదు చేస్తే నలుగురిని మాత్రమే అరెస్టు చేశారని మిగతా వాళ్లను కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ఉన్నాయన్నారు హత్య జరిగితే ముందస్తు మర్డర్ గా అటెంప్ట్ మర్డర్ గా కేసు నమోదు చేయడం విడ్డూరమన్నారు. హత్య జరిగిందని పసిబిడ్డను చంపారని క్లియర్ గా సభ్య సమాజం గుర్తించినప్పటికీ పోలీసులు గుర్తించినట్లుగా లేదన్నారు. తక్షణమే హత్యా నేరం కింద 103 సెక్షన్ పెట్టాలని, ఈ ఘటనలో పాల్గొన్న వాళ్లందర్నీ తక్షణమే అరెస్టు చేయాలని లేని ఎడల కెవిపిఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దైద శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు కారంపూడి ధనమ్మ, వ్యాకస జిల్లా సహాయ కార్యదర్శి జటావత్ రవి నాయక్, కెవిపిఎస్ జిల్లా నాయకులు దొంతాల నాగార్జున దొరేపల్లి మల్లయ్య, రజక సంఘం జిల్లా నాయకులు రెబెల్లి వెంకటేశ్వర్లు, మేకల వెంకన్న, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు తరి రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కోరే రమేష్, , పొదిల వెంకన్న, వర్షిత్, అనుముల దుర్గయ్య ఖమ్మంపాటి సైదులు అనుముల అనిల్ జానకి రాములు గోలి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మిస్ అయిన శిశువులకు పెద్దపల్లి మాత శిశు హాస్పిటల్‌కు సంబంధం లేదని నిర్ధారణ



**పెద్దపల్లి, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దరాత్‌పల్లి గ్రామంలో శిశువులు మిస్సింగ్ అయ్యారనే సమాచారం అందిన వెంటనే స్త్రీ--శిశు సంక్షేమ శాఖ, వైద్య శాఖ అధికారులు గ్రామంలో విచారణ జరిపారు. మిస్సింగ్ అయ్యారనుకున్న పిల్లలు వారి తల్లిదండ్రుల వద్ద ఉన్నట్లు నిర్ధారించారు. అనంతరం శిశువులను, తల్లిదండ్రులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు ప్రవేశపెట్టగా, కమిటీ ఆదేశాల మేరకు శిశువులను కరీంనగర్‌లోని శిశుగృహానికి తరలించారు. ఈ ఘటనపై పూర్తి వాస్తవాలు తెలుసుకోవడానికి పోలీసులకు ఫిర్యాదు చేయబడింది. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. ఈ సంఘటనకు పెద్దపల్లి మాత శిశు హాస్పిటల్‌కు ఎలాంటి సంబంధం లేదని అధికారులు స్పష్టం చేశారు. పేషెంట్లు ఎలాంటి సేవలకు హాస్పిటల్‌ను సంప్రదించినా, చికిత్స చేయడం తమ బాధ్యత అని, పుట్టిన ప్రతి శిశువును తల్లిదండ్రులకు అందజేసి సంతకం తీసుకోవడం జరుగుతుందని, అన్ని రికార్డులు తమ వద్ద ఉన్నాయని హాస్పిటల్ అధికారులు తెలిపారు.

## మౌలిక సదుపాయాల మెరుగుదలకై సర్పంచ్ గుల్ల రజిత రాజు కృషి



**హుస్నాబాద్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చిగురుమామిడి మండలంలోని నవాబుపేట్ గ్రామంలో మౌలిక సదుపాయాల మెరుగుదలలో భాగంగా సర్పంచ్ గుల్ల రజిత రాజు డ్రైనేజీ వ్యవస్థలను స్వయంగా పరిశీలిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. మురుగునీరు నిలిచిపోకుండా, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడానికి పారిశుద్ధ్య కార్మికులతో కలిసి స్వయంగా పనులను పర్యవేక్షిస్తున్నారు. డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ మరియు ఘన వ్యర్థాలను వేయవద్దని, అలా చేయడం వల్ల వ్యవస్థ స్తంభించి మురుగునీరు నిలిచిపోతుందని గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

## 'టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వనపర్తి జిల్లాలో మార్చి 14 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాల్లో 7,228 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన వెల్లడించారు. సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రతి కేంద్రంలో తాగునీరు, విద్యుత్, భద్రత వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి. పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా శాఖల మధ్య సమన్వయం పెంపొందించాలి" అని సూచించారు.

## 9వ తరగతి విద్యార్థులకు గణితం బోధించిన కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బొట్టుగూడ కోమటిరెడ్డి ప్రతిక్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులకు స్వయంగా గణిత పాఠాలు బోధించారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు మించి విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల బోధనను అర్థం చేసుకొని ఉన్నత స్థాయికి చేరాలని కలెక్టర్ ప్రోత్సహించారు.

# పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి

## మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలి : సిఐటియు




**నల్లగొండ, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, జీవో నెంబర్ 51ను సవరించి మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు నల్లగొండ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల అభివృద్ధి అధికారి కార్యాలయం ముందు కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించి, అనంతరం ఎంసీడీఓ యాకూబ్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, "కొత్తగా ఎన్నికైన సర్పంచులు కార్మికులను తొలగిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారు. నవంబర్, డిసెంబర్ నెలల వేతనాలు ఇప్పటికీ ఇవ్వలేదు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా సర్పంచులు వ్యక్తిగత ద్వేషంతో తొలగించడం అన్యాయం" అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం ?26,000 అమలు చేయాలని, పోస్టల్ బీమా కల్పించాలని, డ్రైవర్లకు లైసెన్సులు ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి అర్హత కలిగిన కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వడ్డేపల్లి యాదయ్య, లింగస్వామి, రవి, సాయికుమార్, మల్లయ్య, నాగమణి, సమీనా, భీమయ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ వర్కర్ సమస్యలను పరిష్కరించాలి



**నల్లగొండ, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూనియన్ మండల అధ్యక్షుడు కంచర్ల జానయ్య, కార్యదర్శి పాలడుగు చంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి, పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలి. ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలి. అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలి" అని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్ నాయకులు పీరయ్య, మరియమ్మ, జానమ్మ, హిమాం, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల పట్ల హైకోర్టు తీర్పు చారిత్రాత్మకం: మండ్ల దేవన్న నాయుడు



**వనపర్తి ఫిబ్రవరి 23(నీలగిరి ఎక్స ప్రెస్):** తెలంగాణ హైకోర్టు ఉద్యమకారుల సమస్యలపై ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నేత మండ్ల దేవన్న నాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్లు మంజూరు చేయాలని దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం సానుకూలంగా స్పందించడం హర్షణీయమన్నారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది కరుణాకర్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ఉద్యమకారులకు త్వరితగతిన న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వంలో వారికి తగిన గుర్తింపు దక్కలేదని విమర్శించారు.

# మున్సిపాలిటీ నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే మురళి నాయక్ సన్మానం




**మహబూబాబాద్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ మున్సిపాలిటీలో గెలిచిన కౌన్సిలర్లకు పట్టణంలోని పిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "మహబూబాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు. తెలంగాణలో ఎక్కడా లేని విధంగా మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి సహకారంతో 70 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. ఎన్నికల వేళ పార్టీలు వేర్వేరుగా ఉన్నా, ఎన్నికల తర్వాత మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలి" అని సూచించారు. అభివృద్ధి పనుల్లో ప్రతి కౌన్సిలర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజా సమస్యలను తమ సమస్యలుగా భావించి పరిష్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. కాలనీలలో పరిశుభ్రతపై ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ప్రజల మధ్య తిరిగి సమస్యలను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ గూగులోత్ జ్యోతి రమేష్, వైస్ చైర్మన్ సూర్నపు సోమయ్య, 36 వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి -- కలెక్టర్



**మహబూబాబాద్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "భూమి రికార్డులు, వారసత్వ మ్యుటేషన్లు, పింఛన్లు, రేషన్ కార్డులు, త్రాగునీరు, విద్యుత్, మురుగునీటి సమస్యలపై వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులో పరిష్కరించాలి. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. ఈ ప్రజావాణిలో మొత్తం 131 అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కారానికి ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ

-- బక్కి వెంకటయ్య



**మహబూబాబాద్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ప్రభుత్వం అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో పథకాల అమలు పరిశీలన సందర్భంగా ఆయన జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "అంబేద్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా యువతకు ఉన్నత విద్యావకాశాలు కల్పిస్తున్నాం. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేసి న్యాయం జరుగుతుంది" అని తెలిపారు. తరువాత ఎస్సీ కాలనీలో గృహాలను పరిశీలించి, అంతర్గత రోడ్లు, కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# యువ క్రికెటర్ వైష్ణవి యాదవ్‌కు సన్మానం



**హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, చిన్న శ్రీశైలం యాదవ్‌ను సోమవారం బోడుప్పల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుర్రాల వెంకటేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అండర్--19 క్రికెట్ మ్యాచ్‌లో ఎంపికైన వైష్ణవి యాదవ్‌ను ఎమ్మెల్యేతో కలిసి సన్మానించారు. గుర్రాల వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ, "వైష్ణవి యాదవ్ క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా ప్రతిభ కనబరుస్తోంది. ఆమెకు జాతీయ మహిళా క్రికెట్ జట్టులో అవకాశం కల్పించేందుకు సహకరించాలి" అని కోరారు. దీనికి ఎమ్మెల్యే నవీన్ యాదవ్ సానుకూలంగా స్పందిస్తూ, "సంబంధిత క్రికెట్ అసోసియేషన్‌తో మాట్లాడతాను" అని హామీ ఇచ్చారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, సంబంధిత అధికారులను వెంటనే స్పందించి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి కలెక్టర్ ప్రజల సమస్యలను స్వయంగా స్వీకరించారు. ఎలిగేడు మండలం బుర్హాన్ మియాపేట్ గ్రామానికి చెందిన బి. సదయ్య భూమి పట్టా కోసం చేసిన అర్జీపై తహసిల్దార్‌కు రాసి చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి గ్రామానికి చెందిన నంది పుష్పలత అక్రమ నిర్మాణాల తొలగింపు కోసం చేసిన అర్జీపై మున్సిపల్ కమిషనర్‌కు రాసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓదెల మండలం నాంసానిపల్లి గ్రామానికి చెందిన వి. పైడయ్య పట్టా పుస్తకం జారీ కోసం చేసిన అర్జీపై తహసిల్దార్‌కు రాసి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# భోపాల్‌లో బన్సల్ బంక్ మారథాన్‌లో పాల్గొన్న తెలంగాణ యువకుడు

**జగిత్యాల , ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భోపాల్‌లోని టీటీ నగర్ స్టేడియంలో బన్సల్ బంక్ మారథాన్ 2026 ఘనంగా జరిగింది. ఈ మారథాన్‌లో జగిత్యాల జిల్లా అయితుపల్లి గ్రామానికి చెందిన వంశీ గౌడ్ పాల్గొని తెలంగాణకు ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా వంశీ గౌడ్ మాట్లాడుతూ ఈ మారథాన్ కేవలం పరుగు పోటీ మాత్రమే కాకుండా, ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించేందుకు దేశవ్యాప్తంగా సందేశాన్ని చేరవేయాలనే ఉద్యమమని తెలిపారు. అందరికీ ఫిట్‌నెస్ -- దేశానికి ఫిట్‌నెస్" అనే నినాదంతో సమాజంలో క్రమశిక్షణ, ఐక్యత, అభిరుచిని పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. 10 కిలోమీటర్ల విభాగంలో పాల్గొన్న రన్నర్లు




ఉత్సాహం, పట్టుదల, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. ప్రతి సంవత్సరం వేలాది మందిని ప్రేరేపించే ఈ మారథాన్, ఫిట్‌నెస్ అనేది శారీరక బలం మాత్రమే కాకుండా క్రమశిక్షణ, ఐక్యతకు ప్రతీక అని గుర్తు చేస్తోందని ఆయన అన్నారు.

# విద్యాభారతి గురుకుల పాఠశాలలో
# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం






**మహబూబాబాద్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విద్యాభారతి గురుకుల పాఠశాల స్థాపనకు 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఘనంగా జరిగింది. పాఠశాల కరెస్పాండెంట్ తక్కెళ్ళపల్లి ప్రభాకర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 1985 నుండి ఇప్పటి వరకు చదివిన దాదాపు 2,500 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. తరగతి గదుల్లో మళ్లీ విద్యార్థుల్లా మారి ఉపాధ్యాయులచే పాఠాలు చెప్పించుకుని ఆనందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మున్సిపల్ చైర్మన్ ప్రగతి శ్రీ పాల్ రెడ్డి, డీఎస్పీ బోడ్డు అశోక్, హతిరామ్‌లను ఘనంగా సన్మానించారు. 1989 బ్యాచ్ విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు




ఆకర్షణగా నిలిచాయి. సినీ సంగీత దర్శకుడు బాలశావలి ప్రదర్శనలు, జబర్దస్త్ ఫేమ్ రాజమౌళి హాస్యభరిత ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. పూర్వ ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. 37 బ్యాచ్‌ల విద్యార్థులను తరగతుల వారీగా సత్కరించారు. ఆర్గనైజింగ్ కమిటీ ఉల్యాల శ జైపాల్ రెడ్డి, సంద నరేష్, బోయినపల్లి సతీష్, అజయ్, కార్తిక్ తదితరులు సమ్మేళనాన్ని విజయవంతం చేశారు.

## హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ డ్రైవ్




**హయత్‌నగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ డ్రైవ్‌లో 52 మంది విద్యార్థులకు నియామక పత్రాలు జారీ అయ్యాయి. ఇంగ్లిష్ విభాగం, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్తంగా లక్ష్ ఫౌండేషన్ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. విప్రో, రామోజీ ఫిల్మ్ సిటీ, జస్ట్ డయల్, ముత్తూట్ ఫైనాన్స్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. 302 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలలో పాల్గొనగా, 100 మందికి పైగా ఎంపికయ్యారు. ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేష్ బాబు, ఉపాధి అధికారి రవీందర్ విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి. శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు, లక్ష్ ఫౌండేషన్ ప్రతినిధులు, తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్ మెంటార్ వి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ కోర్స్ బ్రోచర్ విడుదల



**హయత్‌నగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేష్ బాబు ఆధ్వర్యంలో వివిధ సర్టిఫికెట్ కోర్సుల బ్రోచర్ విడుదలైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దడం, ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించడం, ఉపాధి అవకాశాలను విస్తరించడం సర్టిఫికెట్ కోర్సుల ప్రధాన లక్ష్యం" అని తెలిపారు. కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. శారదా దేవి కాలవ్యవధి, విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, శ్రీమతి ఇందిర, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ మధు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ

**అచ్చంపేట, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



మామిళ్లపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్స్‌ను సోమవారం అచ్చంపేట శాసనసభ్యుడు డాక్టర్ చెక్కుడు వంశీకృష్ణ సమక్షంలో దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 28 నుండి మార్చి 5 వరకు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, ఉప్పునుంతల సబ్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి, అచ్చంపేట మున్సిపాలిటీ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, పదర మండలం మాజీ జెడ్పిటిసి రాంబాబు, ఉప్పునుంతల కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పరిశోధనా రంగంలో నైపుణ్యం సాధించాలి

- ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి




**హుస్నాబాద్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్నాబాద్‌లో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో రీసెర్చ్ మెథడాలజీ మరియు ప్రాజెక్ట్ పై ఒకరోజు కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ చదువుతూనే పరిశోధనా రంగంపై ఆసక్తి పెంచుకొని కొత్త విషయాలను కనిపెట్టి దేశాభివృద్ధికి వెన్నెముకగా నిలవాలని సూచించారు. రిసోర్స్ పర్సన్‌గా హాజరైన ఎస్.ఆర్.ఆర్. గవర్నమెంట్ డిగ్రీ కళాశాల కరీంనగర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బూర్ల నరేష్, రీసెర్చ్ మెథడాలజీ ప్రాధాన్యతను వివరించి ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీ విధానాన్ని కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి డాక్టర్ వి. చంద్రమౌళి, లెక్చరర్ రమేష్, అకాడమీ కోఆర్డినేటర్ డాక్టర్ బాలరాజు, అధ్యాపకులు అనిత, సుధా మాధురి, రాజ్యలక్ష్మి, శ్రీనివాస్, లక్ష్మి తదితరులు విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు.

## హుస్నాబాద్ నుండి భద్రాచలం బాసర కు నూతన ఆర్టీసీ బస్సు సౌకర్యం



**హుస్నాబాద్ ,ఫిబ్రవరి 23(నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
హుస్నాబాద్ నుండి భద్రాచలం, బాసర, ఆదిలాబాద్ కు నూతన ఆర్టీసీ బస్సు సర్వీసులను డిపో మేనేజర్ వెంకన్నతో కలిసి హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి, పాలకవర్గ సభ్యులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్సులో టికెట్ తీసుకొని కొద్ది దూరం ప్రయాణించారు. హుస్నాబాద్ నుండి ఆధ్యాత్మిక, దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో మూడు నూతన బస్సు సర్వీస్ లను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ వెంకన్న తెలిపారు. పొద్దున, మధ్యాహ్నం, సాయంత్రం మూడు షిఫ్టుల్లో అదిలాబాద్ కు ఎక్స్ ప్రెస్ బస్సులు నడుపనున్నట్లు వెల్లడించారు. ప్రయాణికులు బస్సు సర్వీస్ లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు ఆకుల రజిత,గోపగోని శోభన్, వైద్యం కిరణ్,కొండ రజిత, బూరుగు లత,కేశవేని రమేష్, పిల్లి తిరుపతి, చెన్న బోయిన అనూష, బత్తుల స్వరూప,పూదరి వరప్రసాద్, ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## వివిధ కేసుల్లో పలు వ్యక్తుల బైండోవర్

**కరీంనగర్ రూరల్ మండలం, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**




వివిధ కేసుల్లో 14 మంది వ్యక్తులను బైండోవర్ చేసినట్లు సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు. ఇటీవల అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కన్నం అనిల్, బండారి రాజు, వడ్లకొండ రాజ్‌కుమార్, సిలివేరి శ్రీకాంత్, దర్శనాల లక్ష్మణ్ మరియు మానకొండూరు మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన తిట్ల అనిల్, వెల్ది గ్రామానికి చెందిన ఆరేల్లి సాయికుమార్‌లను బైండోవర్ చేశారు. అలాగే అతిగా మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కలిగించిన వనపర్తి వంశీకృష్ణ, చాడ రామచంద్రారెడ్డి, ఆవుల శివ గణేష్, చింతల మనోజ్‌కుమార్, మర్రి భరత్ చంద్ర, చిలుముల సాకేత్ రామ్, శనిగారపు ప్రణీత్‌లను కరీంనగర్ రూరల్ మండలం తహసిల్దార్ ముందు హాజరుపరిచి లక్ష రూపాయల పూచికత్తుపై బైండోవర్ చేశారు. చట్ట వ్యతిరేకమైన పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## ఎలిగేడు ఎస్బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత సదస్సు



**ఎలిగేడు, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎస్బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు జరిగింది. ఖాతాదారులు కేవైసీ అప్డేట్ చేసుకోవాలని, అపరిచిత ఫోన్‌కాల్స్, ఆన్లైన్ లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఓటీపీలు, ఏటీఎం పిన్‌లు, నెట్‌బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌లు ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలు జరిగితే వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అమర్ నాయక్, కౌన్సిలర్లు జ్యోతి, సుజాత, ఫీల్డ్ ఆఫీసర్ చంద్రకాంత్, సీఎస్పీ పెద్ది కుమార్, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ దాడికి నిరసనగా బీజేపీ నాయకుల వినతిపత్రం

**ఎలిగేడు, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



కామారెడ్డిలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌పై కాంగ్రెస్ నాయకుల దాడిని నిరసిస్తూ ఎలిగేడు మండల కేంద్రంలో బీజేపీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీజేపీ నాయకులపై దాడులు ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గాదె రంజిత్ రెడ్డి, నాయకులు గోపు సురేందర్ రెడ్డి, కొత్తిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, తిరుపతి గౌడ్, అంజయ్య, శంకర్, కిరణ్, బాస్కర్, విక్రమ్ రెడ్డి, శ్రీనివాస్, దేవ పవన్, దేవ జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.


## ఏసిపి, సీఐ, ఎస్ఐలను కలిసిన మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య



**పెద్దపల్లి, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి మున్సిపాలిటీ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ లక్ష్మణ్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌గా ఎన్నికైన తర్వాత మొదటిసారి ఏసిపి కార్యాలయానికి వచ్చిన మల్లయ్యను అధికారులు పూల బొకే, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసిపి గజ్జి కృష్ణ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో పోలీస్ అధికారులకు సహకరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి పరిపాలన అందించాలని మున్సిపల్ చైర్మన్‌ను కోరారు. పెద్దపల్లి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఏసిపి సహా పోలీస్ అధికారులు తగిన సూచనలు ఇస్తూ తమ వంతు సహకారం అందించాలని మల్లయ్య అభిప్రాయపడ్డారు.

## అక్రమంగా నిర్మించిన సీసీ రోడ్డును తొలగించాలి

**- ఇస్కిల్ల నవీన్ కుమార్**



**పెద్దపల్లి, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జూలపల్లి మండలం పెద్దపూర్ గ్రామానికి చెందిన ఇస్కిల్ల నవీన్ కుమార్ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన స్వంత భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా సీసీ రోడ్డును నిర్మించారని, దానిని తొలగించాలని ఆయన కోరారు. బాధితుడు వివరాల ప్రకారం గ్రామ పంచాయితీ తీర్మానం లేకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా, రికార్డుల్లో నక్షా లేకుండా మాజీ సర్పంచ్ గొట్టిముక్కుల రవీందర్ రెడ్డి, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు మరియు మరికొందరు కలిసి తన గుడిసె స్థలంలో నుండి 10 అడుగుల రోడ్డును నిర్మించారని తెలిపారు. ఈ రోడ్డు కేవలం ఒకే ఇల్లు ప్రయోజనం కోసం మాత్రమే నిర్మించబడిందని, ఇరువైపులా ఎలాంటి ఇండ్లు లేకపోయినా తన భూమి దాదాపు ముప్పావు గుంట వరకు ఆక్రమించారని ఆయన ఆరోపించారు. వర్క్ లొకేషన్ పర్మిషన్ ఒక చోట ఉండగా వేరే చోట నిర్మాణం చేపట్టారని, తల్లిదండ్రులను కోల్పోయి చదువుకున్న నిరుద్యోగిగా తన భూమి తిరిగి ఇవ్వాలని, అక్రమ నిర్మాణంలో పాలుపంచుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

## పసిపాప మృతికి కారకులను శిక్షించాలని జేపీసీ డిమాండ్





**పెద్దపల్లి, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా కమ్మెర గ్రామంలో మల్లన్న దర్శనం కోసం వెళ్లిన రజక కులానికి చెందిన చంద్రకళ కుటుంబంపై దాడి చేసి, రెండు నెలల పసిపాప మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కుమ్మెర కొండపై ఉన్న ఆలయాన్ని కొందరు పెత్తందారులు తమ ఆధీనంలో ఉంచుకొని అక్రమ వసూళ్లు చేస్తూ, దేవాదాయ శాఖ పరిధిలోకి రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. చిన్నారి తల్లి చేసిన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోకుండా, దాడి చేసిన పెత్తందారుల ఫిర్యాదును ముందుగా పరిగణనలోకి తీసుకోవడం వారి కుల వివక్షపూరిత వైఖరిని స్పష్టంగా చూపుతోందని అన్నారు. సీఎం సొంత జిల్లాలో బహుజనులపై దాడులు జరిగినా ఇప్పటికీ రేవంత్ రెడ్డి స్పందించకపోవడం కుల దురాహంకారమని ఆయన మండిపడ్డారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని, దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి రామ్మూర్తి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలసాని లెనిన్, టీఆర్పీ పార్టీ రాష్ట్ర నాయకుడు గుండవేన స్వామి యాదవ్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ రావు, ఎస్సీ ఎస్టీ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కట్కూరి సందీప్, కేవీపీఎస్ నాయకులు శ్రావణ్, కళ్లపల్లి అశోక్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు



**అచ్చంపేట, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. గిరిజన భవన్ నుండి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు బంజారా సంస్కృతి, సాంప్రదాయాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చెక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పదర మండలంలోని మద్దిమడుగులో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. సేవాలాల్ మహారాజ్‌ను ఆదర్శవంతంగా తీసుకొని జాతిని జాగ్రత్తపరిచిన మహనీయునికి ఘన నివాళి అర్పించాలన్నారు. వచ్చే జయంతి నాటికి సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణం పూర్తి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. భోగ్ బండారో కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. సేవాలాల్ మహారాజ్‌ను స్మరించుకుంటూ బంజారా ప్రజలు నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిటిడిఓ ఫిరంగి, గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు లచ్చు నాయక్, ప్రధాన కార్యదర్శి దగ్గు నాయక్, బిచ్చు నాయక్, శత్రు నాయక్, గిరిజన ఉద్యోగ సేవా సంఘం అధ్యక్షుడు శంకర్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి రాజగోపాల్, మాజీ జెడ్పిటిసి రాంబాబు, మాజీ జెడ్పిటిసి మంత్రియా నాయక్, మద్దిమడుగు పీఠాధిపతి జయరాం గురుస్వామి, తులసిరాం నాయక్, చందు స్వామి, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, గ్రంధాలయ చైర్మన్ రాజేందర్, బీసీ సంఘం నాయకులు కాశన్న యాదవ్, మాజీ ఎంపీపీ రామనాథం, మాజీ మున్సిపల్ చైర్మన్ తులసిరాం నాయక్‌తో పాటు అన్ని గ్రామాల బంజారా సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణలో రాజకీయ ప్రత్యామ్నాయంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్




**కరీంనగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతుందని రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి తెలిపారు. సోమవారం కరీంనగర్ పట్టణంలోని మైత్రి హోటల్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆర్.వి. ప్రసాద్ అధ్యక్షత వహించగా, రాష్ట్రంలోని వివిధ జిల్లాల కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబటి జోజి రెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఒక మున్సిపాలిటీతో పాటు 33 స్థానాల్లో విజయకేతనం ఎగరేశారని, ఇది ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎదుగుదలకు నిదర్శనమని అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ విధానాలను అనుసరిస్తూ తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా ముందుకు వెళ్తున్నామని, రానున్న పరిషత్ ఎన్నికల్లో కూడా తమ సత్తా చాటుతామని స్పష్టం చేశారు. ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహించడానికి రాష్ట్ర కమిటీ సమావేశంలో తీర్మానాలు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి నిర్లక్ష్యం చూపుతోందని, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్, కేంద్రంలో ఉన్న బీజేపీ కూడా ప్రజా సమస్యలను పక్కన పెట్టి తమ పార్టీల బలోపేతం పనిలో నిమగ్నమయ్యాయని ఎద్దేవా చేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సమ సమాజ స్థాపన లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ముందుకు వెళ్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తేజ్ దీపరెడ్డి, రాష్ట్ర నాయకులు గొల్లపల్లి రాజుగౌడ్, రాములు యాదవ్, అంద బీరన్న, బత్తుల మధు ప్రకాష్, హకీమ్ నవీద్, సత్యరావు తదితరులు పాల్గొన్నారు.

## సంసద్ ఖేల్ మహోత్సవ్ క్రీడా పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనబరచాలి

**- గంగాడి కృష్ణారెడ్డి**




**కరీంనగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సంసద్ ఖేల్ మహోత్సవ్ పేరిట క్రీడా పోటీలు మార్చి 1 నుండి 7 వరకు జరగనున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మార్చి 1 నుండి 3 వరకు పోటీలు నిర్వహించి, గెలుపొందిన జట్లు మార్చి 5, 6, 7 తేదీల్లో కరీంనగర్ హెడ్‌క్వార్టర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాయని చెప్పారు. కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఏర్పాట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా తీర్చిదిద్దాలనే విజన్‌తో ప్రతి ఏటా ఖేల్ మహోత్సవ్ నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ పోటీలు యువ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడంలో ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, హాకీతో పాటు అథ్లెటిక్స్‌లో 100, 400 మీటర్ల పరుగు పందెం, హై జంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావెలిన్, డిస్క్ త్రో వంటి క్రీడా విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. అసెంబ్లీ వారీగా ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఈనెల 25 నుండి 27 వరకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్, కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీతో పాటు అసెంబ్లీ నియోజకవర్గ నేతలు, కార్పొరేటర్లు, ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

## డిజిటల్ కీ దుర్వినియోగంపై సర్పంచ్ ఆగ్రహం



**తిమ్మాపూర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిమ్మాపూర్ మండల ఎంపిడిఓ కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మొగిలిపాలెం సర్పంచ్ మాట్లాడుతూ, తనకు తెలియకుండా గ్రామ పంచాయతీ అకౌంట్ నుండి కార్యదర్శి నాలుగు లక్షల రూపాయలు తీసి దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కనీస సమాచారం ఇవ్వకుండా కార్యదర్శి ఒంటెద్దు పోకడపై వ్యవహరించడం పట్ల సర్పంచ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై డీపీఓకు ఫిర్యాదు చేసినప్పటికీ వారంరోజులు గడిచినా స్పందన లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి



**హుస్నాబాద్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ రోజు చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపు మేరకు హుస్నాబాద్ మండల ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టు అయిన ఆశా కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ సంఘీభావం తెలుపుతూ వారి పోరాటానికి మద్దతు ప్రకటించింది. అనంతరం ఆశా కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో, పట్టణ వార్డుల్లో ప్రజల కోసం కష్టపడుతూ, తక్కువ పారితోషికంతో జీవనం సాగిస్తున్నారని, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వారి జీవితం మరింత కష్టసాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. దాదాపు 15 సంవత్సరాలుగా చిన్న జీతాలతో పనిచేస్తున్న ఆశా కార్యకర్తల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి కనికరం లేకపోవడం విచారకరమని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, సమస్యలు పరిష్కరించకుండా, ఆశా కార్యకర్తలను అరెస్టు చేయించడం అన్యాయమని ఆయన విమర్శించారు. ఆశా కార్యకర్తల పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ ప్రత్యక్షంగా మద్దతు తెలుపుతుందని, వారి సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని మల్లికార్జున రెడ్డి స్పష్టం చేశారు. ఈ రోజు అరెస్టు చేసిన వారిలో తగరపు భాగ్యలక్ష్మి, వర్ష, శోభారాణి, గడిపే అనసూర్య, దప్పుట జ్యోతి, ఆకారపు కోమల, పున్న అనిత, పచ్చమట్ల స్వరూప, గడిపే రజిత, మల్లిక, లలిత తదితర ఆశా కార్యకర్తలు ఉన్నారు.

# ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



**సిద్దిపేట, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రజలకు మేలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఫిర్యాదుదారుల నుండి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు వెంటనే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన భూ సంబంధిత, హౌసింగ్, ఆసరా పింఛన్లు మరియు ఇతర సమస్యలకు సంబంధించిన మొత్తం 205 అర్జీలను స్వీకరించారు. అర్జిదారులు తిరిగి మళ్లీ దరఖాస్తు పెట్టుకోకుండా సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పవన్ కుమార్, ఏఓ రాజ్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గౌరవెల్లి ప్రాజెక్ట్ పై సమీక్షా సమావేశం



**కరీంనగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గౌరవెల్లి ప్రాజెక్ట్ అనేక కారణాలు, లీగల్ ఇష్యూస్ వల్ల చాలా కాలంగా ఆలస్యమవుతున్నది. ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయాల్సిన అవసరంపై హుస్నాబాద్ శాసనసభ్యుడు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిరంతరం ఇరిగేషన్ శాఖపై ఒత్తిడి తీసుకొస్తున్నారని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ రోజు హైదరాబాదులో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సిద్ధిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, రాష్ట్ర అడ్వకేట్ జనరల్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్న సమీక్షా సమావేశం జరిగింది. గౌరవెల్లి ప్రాజెక్ట్‌లో లీగల్ ఇబ్బందులను ఎలా అధిగమించాలి, భూసేకరణ పనులను వేగవంతం చేయడం ఎలా అనే అంశాలపై చర్చించారు. భూసేకరణకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఎల్లుండి సుప్రీం కోర్టులో ఎన్విరాన్మెంట్ కేసు విచారణ ఉండగా, ఆ కేసులో విజయం సాధిస్తామనే నమ్మకం వ్యక్తం చేశారు. గౌరవెల్లి ప్రాజెక్ట్‌ను అన్ని విధాలుగా పూర్తి చేయడానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, దేవాదుల ప్రాజెక్ట్ నీళ్లు హుస్నాబాద్ నియోజకవర్గానికి చేరేందుకు కావలసిన పెండింగ్ పనులను పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులు




**కరీంనగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కరీంనగర్ జిల్లా సైన్స్ మ్యూజియంలో జరిగిన ఈ పరీక్షలో 16 మండలాల ప్రభుత్వ పాఠశాలల 9వ తరగతి టాపర్ విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను నిజజీవితంతో అనుసంధానం చేసుకొని, క్రమశిక్షణతో చదువుతూ భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి టాలెంట్ టెస్ట్ పేపర్‌ను ఆవిష్కరించి, విద్యార్థులు సైన్స్ మ్యూజియం సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. కరీంనగర్ నుండి కనపర్తి సుశాంత్ ప్రథమ స్థానం, భూంపల్లి కీర్తి ద్వితీయ స్థానం, కోమటిరెడ్డి ఆదిత్య తృతీయ స్థానం సాధించారు. విజేతలకు మెమెంటోలు అందజేశారు. రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనే అవకాశం లభించనుంది. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ మిలకూరి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, ఫోరమ్ సభ్యులు నాగుల భుజన్ చందర్, నలుమాచు చంద్రశేఖర్, కామిరెడ్డి రామేశ్వర్ రెడ్డి, గైడ్ టీచర్లు గోరంటల ఆనందం, ఎండీ మునీరొద్దిన్, 32 పాఠశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర కార్యదర్శిగా ఊరడీ ఆనంద్ యాదవ్ నియామకం



**కరీంనగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర కార్యదర్శిగా కరీంనగర్ నివాసి ఊరడీ ఆనంద్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఏష బోయిన సాంబయ్య యాదవ్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ యాదవ్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో సామాజిక న్యాయ వేదికను బలోపేతం చేయడమే తన లక్ష్యమని, రాష్ట్ర నాయకత్వం తనకు ఇచ్చిన అవకాశానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

# రెవెన్యూ శాఖలో పోస్టులు భర్తీ చెయ్యాలని సిపిఐ డిమాండ్



**గన్నేరువరం, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గన్నేరువరం మండలంలోని భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) నాయకులు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలు చాలావరకు పెండింగ్‌లో ఉన్నాయని, భూభారతిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కోరారు. కొన్ని గ్రామాలకు ఇన్‌ఛార్జ్ జీపీలను మాత్రమే నియమించడం వల్ల, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఒకరే ఉండటంతో భూ సమస్యలు ఆలస్యమవుతున్నాయని వారు పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ డిమాండ్



**కరీంనగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రఫీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్‌ను ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వాలనే ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని, సెస్సు రెండు శాతం పెంచాలని, సహజ మరణం కింద ఇచ్చే సాయం మొత్తాన్ని ఐదు లక్షలకు పెంచాలని, డెలివరీ, పెండ్లి కానుకలను లక్ష రూపాయలుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఎస్సి హెల్త్ టెస్టులను రద్దు చేసి, జీవో నెంబర్ 12ను సవరించి వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. వెల్ఫేర్ బోర్డు నిధులు 346 కోట్లు అక్రమంగా ప్రైవేట్ భీమా కంపెనీలకు ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పెండింగ్ క్లెయిమ్‌లకు నిధులు విడుదల చేసి 60 ఏళ్లు పైబడిన కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు గందె కొమురయ్య మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని వెంటనే నియమించి, 2009 నుండి రీన్యువల్ కాని 12 లక్షలకు పైగా లేబర్ కార్డులను యుద్ధ ప్రాతిపదికన రీన్యువల్ చేయాలని అన్నారు. కార్మిక శాఖలో ఓబీసీకి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పట్టణాల్లో లేబర్ అడ్డాల వద్ద తాగునీరు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, మీ సేవలో అధిక డబ్బులు వసూలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు రేగుల కుమార్, గామినేని సత్యం, పుట్ట మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సహాయం అందించి సామాజిక బాధ్యతను చాటిచెప్పిన డాక్టర్ శివాని



**హుస్నాబాద్ , ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: చిగురుమామిడి గ్రామ మాజీ ఉపసర్పంచ్ కీర్తిశేషులు భూపతి శ్రీనివాస్ రెడ్డి కుమార్తె డాక్టర్ భూపతి శివాని ఈరోజు గ్రామంలోని పేద ప్రజలకు వైద్య సేవలు అందించారు. నిరుపేద కుటుంబాలకు అవసరమైన వైద్య సహాయం అందించి సామాజిక బాధ్యతను చాటిచెప్పారు. తండ్రి సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ గ్రామ ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం ముందుకు రావడం అభినందనీయం అని గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల తరఫున డాక్టర్ శివానికి పూల బొకే అందించి శాలువాతో సన్మానం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగించాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ డిమాండ్



**కరీంనగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంప్ ఆఫీస్‌పై కాంగ్రెస్ శ్రేణులు చేసిన దాడిని నిరసిస్తూ, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగిడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గంగిడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు వీధి రౌడీల్లా ప్రవర్తిస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా దాడులు, దౌర్జన్యాలు, అరాచకాలు పెరిగిపోయాయని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో లా అండ్ ఆర్డర్ అదుపుతప్పిందని, ముఖ్యమంత్రి వద్దే హోంశాఖ ఉండి శాంతి భద్రతలను పరిరక్షించలేని దారుణ స్థితి నెలకొన్నదని ఎద్దేవా చేశారు. కామారెడ్డి ఘటనలో దాడి చేసిన కాంగ్రెస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆందోళనలో బీజేపీ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేష్, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, నరసింహ రాజు, కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, బండ రమణ రెడ్డి, సోమిడీ వేణు ప్రసాద్, బండారి వేణు, సౌగాల కొమురయ్య, నాంపల్లి శ్రీనివాస్, తాటి ప్రభావతి, ఎన్నం ప్రకాష్, కోడూరి చంద్ర, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, వుగెలే సుధాకర్, దాసరి రమణ రెడ్డి, తణుకు సాయి, కుంట తిరుపతి, జాడి బల్ రెడ్డి, అడిచేర్ల రాజు, ఉప్పుర్పెల్లి శ్రీను, లడ్డూ ముందాడ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సమక్షంలో ఉచిత అల్పాహార వితరణ



**కరీంనగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్‌లోని మాత శిశు ఆసుపత్రి ప్రాంగణంలో లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320+ ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం ద్వారా 967వ రోజు ఉచిత అల్పాహారం పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ టవర్ అధ్యక్షుడు రంగు రాజు, అరికొంతం రవీందరరెడ్డి, జిల్లా కృష్ణ, బద్దం మల్లారెడ్డి పాల్గొన్నారు. కరీంనగర్ 53వ డివిజన్ శర్మనగర్ కార్పొరేటర్ కొంపల్లి శ్వేత రామన్ ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి పర్యటించగా, స్థానికులు ఘన స్వాగతం పలికారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజు దేవిక దంపతులు, రంగు శంకరాచారి, పుష్పలత, తాడూరి నాగభూషణం, జయ కనకయ్య, రాజేశ్వరి దంపతులు, నాంపల్లి విజయలక్ష్మి, గాలిపల్లి లక్ష్మీనారాయణ, కట్టా శీను, ఉదారపు ఆంజనేయులు, రంగు రాజేష్ తదితరులు హాజరై డివిజన్ సమస్యలను తెలియజేసి కార్పొరేటర్‌ను ఘనంగా సన్మానించారు.

## మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ జాగృతి ధర్నా



**కరీంనగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, కానీ ఇప్పటి వరకు వాటిని అమలు చేయకుండా మహిళలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద ఇవ్వాల్సిన రూ.2,500 రూపాయలు, కళ్యాణలక్ష్మితో కలిపి ఇవ్వాల్సిన తులం బంగారం, చేయూత పథకం కింద 4000 రూపాయల పింఛన్, విద్యార్థినిలకు స్కూటీలు ఇప్పటికీ అందలేదని ఆయన పేర్కొన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం అన్యాయమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను ఎగగొట్టే ప్రయత్నం చేస్తున్నందుకు నిరసనగా ఈ నెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని తెలిపారు. జిల్లా జాగృతి మహిళ విభాగం అధ్యక్షురాలు అక్కం శివరాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, పిన్నింటి సంగీతా రెడ్డి, జంగ అపర్ణ, ఐలా ప్రసన్న, కాంతాల రోజారెడ్డి, నవ్య తదితరులు పాల్గొన్నారు.

## టి.ఎస్.కె.సి సమక్షంలో ఇన్ఫోసిస్ ఫ్రీ ట్రైనింగ్ & ప్లేస్మెంట్ ఓరియంటేషన్ విజయవంతం



**కరీంనగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్‌లోని ఎస్ ఆర్ ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో విద్యార్థుల భవిష్యత్ ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ఇన్ఫోసిస్ ఫ్రీ ట్రైనింగ్ ఓ ప్లేస్మెంట్ ఓరియంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇన్ఫోసిస్ శిక్షకుడు పి. అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు సంస్థ అందిస్తున్న ఉచిత శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ వంటి ఆధునిక రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రతిభను అభివృద్ధి చేసుకుంటే దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతమైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీ సాధించడం సరిపోదని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా స్కిల్ ఆధారిత కోర్సులు పూర్తి చేయడం అత్యవసరమని అన్నారు. మెరీనా పెయింట్స్ కంపెనీ డైరెక్టర్ జి. పవన్, పరిశ్రమల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను వివరించారు. టి.ఎస్.కె.సి కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్ కుమార్ విద్యార్థులు చదువుతో పాటు ఇంటర్న్‌షిప్ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించగా, ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ డాక్టర్ హర్జోత్ కౌర్ డిజిటల్ యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం, డేటా అనలిటిక్స్, సాఫ్ట్ స్కిల్స్ ప్రాధాన్యతను వివరించారు. కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ కె. సుధాకర్ విద్యార్థులు స్వయం ఉపాధి, స్టార్టప్‌లు, డిజిటల్ సర్వీసుల ద్వారా ఎదగవచ్చని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధి అవకాశాలకు దోహదపడేలా నిర్వహించిన ఈ ఓరియంటేషన్ విజయవంతంగా ముగిసింది.

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అరెస్టులపై బీజేపీ నిరసన





**మానకొండూర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అరెస్టులను నిరసిస్తూ మానకొండూరులో అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ నిరసన కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కంది రాజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను ఓర్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేస్తూ, బీజేపీ కార్యకర్తలపై అణచివేతలు కొనసాగిస్తోందని విమర్శించారు. కరీంనగర్‌లో అధికార పార్టీకి బుద్ధి చెప్పినట్లే, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కూడా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అప్పాని తిరుపతి, మండల నాయకులు మీసా రమణయ్య, సొన్నాకుల శ్రీనివాస్, కత్తి ప్రభాకర్ గౌడ్, పోచంపల్లి శ్రీనివాస్, శీలం కుమార్ యాదవ్, ఎదులాపురం అశ్విన్ తేజ, డాక్టర్ మార్కొండ రమేష్, తాడూరి కిరణ్ రెడ్డి, గాజుల రాజు, ఆదిమూలం శ్రీకాంత్, నందగిరి బలరాం, రమేష్, కూకట్ల రాజయ్య, కత్తి రాకేష్, మిరాల హరీష్, పోచంపల్లి చందు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ జీతాల చెల్లించాలని పంచాయతీ కార్మికుల నిరసన




**కరీంనగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రజావాణి ద్వారా వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి గిట్ల ముకుంద రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉప్పునుటి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా పంచాయతీ కార్మికులకు ప్రతి నెల జీతాలు ఇవ్వడంలో విఫలమైందని విమర్శించారు. కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు అందించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రమాద బీమా 10 లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేయాలని, గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా జీతాలు అకౌంట్లలో జమ చేయాలని, సంవత్సరానికి రెండు జతల బట్టలు, పనిముట్లు, పరికరాలు అందించాలని కోరారు. పేలు నమోదు లేని కార్మికుల పేర్లను వెంటనే నమోదు చేయాలని, అసెంబ్లీ బడ్జెట్‌లో కార్మికులకు నిధులు కేటాయించాలని, లేనిపక్షంలో చలో హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాచర్ల మల్లేశం, కమిటీ సభ్యులు ఎండిగా రవీందర్‌రావు, కాశి పాక శంకర్, గాజర్ల రాజు, రుద్రారపు నాంపల్లి, మధు నక్క, స్వరూప, కొత్తూరు మల్లయ్య, ఆకునూరి సుధాకర్, బిక్షపతి, శ్రీకాంత్, చంద్రయ్య, కుమార్, లత చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా అరెస్టులను నిలిపివేయాలని బీజేపీ నిరసన



**కరీంనగర్ జిల్లా, హుజురాబాద్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావును అక్రమంగా అరెస్టు చేసిన ఘటనను నిరసిస్తూ హుజురాబాద్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు మాట్లాడుతూ ఒకవైపు బీజేపీ ఎమ్మెల్యేలపై దాడులు, మరోవైపు హిందువులపై దారుణమైన అకృత్యాలు జరుగుతున్నాయని, ఈ అరాచకాలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను అక్రమంగా అరెస్టు చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. ప్రశ్నించిన వారిని అరెస్టు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలను మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొలిపాక శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు తూముల శ్రీనివాస్, నరాల రాజశేఖర్, యాంసాని శశిధర్, ఓడ్నాల విజయ్, బొరగాల సారయ్య, గంట సంపత్, డోరి ఐలయ్య, కొడిమ్యాల పవన్ కుమార్, శ్రీధర్, కుత్తాడి కుమారస్వామి, మోటపోతుల రాకేష్, దున్నపోతుల అశోక్, రాజేష్ ఖన్నా, క్యాశ వెంకటేష్, నీలం రవీందర్, రామచంద్రం, బోడిగే శూదర్శన్, తూర్పాటి రాజశేఖర్, పర్థం విజయ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కౌన్సిలర్లు




**జగిత్యాల, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన జగిత్యాల నియోజకవర్గంలోని జగిత్యాల, రాయికల్ పట్టణ కౌన్సిలర్లు ఈరోజు హైదరాబాద్‌లో నిజాంబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి కూడా పాల్గొన్నారు. కౌన్సిలర్లతో కలిసి జరిగిన ఈ సమావేశంలో స్థానిక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, రాయికల్ పట్టణ అధ్యక్షుడు కుర్మా మల్లారెడ్డి, కౌన్సిలర్లు కల్లెడ ధర్మపురి, వేముల శ్రీనివాస్, నిమ్మల నాగరాజు, కొక్కు అనిత, సిరిపురం శ్రీలత-శ్రీనివాస్, గట్టి పెల్లి జ్ఞానేశ్వర్, కునారపు మానస-భూమేష్, తోపారపు ప్రశాంతి-సురేష్, పుర్రె శ్రీధర్, వేముల మౌనిక-రాము తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం నిరంతర ప్రక్రియ

-- ఎమ్మెల్యే విజయరమణారావు



**ఎలిగేడు, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను నిరంతరంగా కొనసాగిస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు.ఎలిగేడు మండల శివపల్లి గ్రామంలో లబ్ధిదారులకు రూ.28.03 లక్షల విలువైన కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "కళ్యాణలక్ష్మీ పథకం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అభివృద్ధి, సంక్షేమం వల్లే గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది" అని తెలిపారు.ఎలిగేడు మండలంలో 12 గ్రామాల్లో 11 సర్పంచ్ స్థానాలు, సుల్తానాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో 13 స్థానాలు, పెద్దపల్లిలో 31 కౌన్సిలర్ స్థానాలు కాంగ్రెస్ గెలిచిందని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఆర్.ఏ. చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్ రావు, సర్పంచులు కప్పల ప్రవీణ్, రంగులత శ్రీనివాస్ గౌడ్, ఏలేటి వెంకటరెడ్డి, సిద్ది తిరుపతి యాదవ్, మద్దెల రమాదేవి సంపత్, రామిడి శైలజ వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# చిన్నారి పునర్విక ప్రాణాల కోసం నల్లచెరువు యువత ముందడుగు

-పాఠశాలల్లో విరాళాల సేకరణకు శ్రీకారం



**నల్లచెరువు,ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కర్నూలు జిల్లాకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి పునర్విక (9) (ఎస్.ఏ.ఏం) అరుదైన వ్యాధి బారినపడి ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన ప్రత్యేక ఇంజక్షన్ ధర సుమారు రూ.16 కోట్లు కావడంతో దేశవ్యాప్తంగా విరాళాల సేకరణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే పలువురు దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లచెరువు మండలానికి చెందిన యూత్ టీం సభ్యులు "మేము సైతం" అంటూ ముందుకు వచ్చారు. సోమవారం మండలంలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి, పునర్విక ఆరోగ్య పరిస్థితి, చికిత్సకు అవసరమైన భారీ వ్యయంపై విద్యార్థులకు వివరించారు. చిన్నారి ప్రాణరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించి మానవత్వం చాటుకోవాలని పిలుపునిచ్చారు.మంగళవారం ఉదయం నుంచి మండలంలోని పాఠశాలలు, ప్రభుత్వ--ప్రైవేట్ కార్యాలయాలు, దుకాణాలలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. "మనమందరం అందించే ఒక్క రూపాయి కూడా ఒక ప్రాణాన్ని కాపాడగలదన్న నమ్మకంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.చిన్నారి పునర్విక ప్రాణాల కోసం సమాజం మొత్తం కదలాల్సిన సమయం వచ్చిందని,ప్రతి వర్గం ప్రజలు స్పందించి సహకరించాలని యూత్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.సి.యు లోకల్ న్యూస్ అధినేత ఆర్.జిలాన్ బాషా, మండల మనం దినపత్రిక విలేకర్ వాదలపల్లి బావాజీ, మండల శుభోదయం దినపత్రిక విలేకర్ ఆర్.మాలిక్ బాషా,ఖాద్రి కేబుల్ విలేకర్ వానిల్లు షాకీర్, యువకులు షాహిద్, ఫయాజ్, వల్ల భరత్, గురు,సాయి,భార్గవ తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరు ఎస్బిఐ బ్యాంక్ ఎదుట గోల్డ్ లోన్ బాధితుల నిరసన



**చెన్నూరు, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణ కేంద్రంలోని ఎస్బిఐ(2)బ్రాంచ్ ఎదుట గోల్డ్ లోన్ బాధితుల నిరసన...బ్యాంక్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు.గత ఏడు నెలల నుండి మా బంగారం మాకు ఇవ్వకుండా బ్యాంకు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేసిన గోల్డ్ లోన్ భాదితులు.

# విద్యార్థులందరూ శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే




**కరీంనగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.కరీంనగర్ జిల్లా సైన్స్ మ్యూజియంలో జరిగిన ఈ పరీక్షలో 16 మండలాల ప్రభుత్వ పాఠశాలల 9వ తరగతి టాపర్ విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను నిజజీవితంతో అనుసంధానం చేసుకొని, క్రమశిక్షణతో చదువుతూ భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. శాస్త్రవేత్తల కృషిని స్ఫూర్తిగా తీసుకొని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల్లో పట్టు సాధించాలని ఆకాంక్షించారు.జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి టాలెంట్ టెస్ట్ పేపర్‌ను ఆవిష్కరించి, విద్యార్థులు సైన్స్ మ్యూజియం సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. కరీంనగర్ నుండి కనపర్తి సుశాంత్ ప్రథమ స్థానం, భూంపల్లి కీర్తి ద్వితీయ స్థానం, కోమటిరెడ్డి ఆదిత్య తృతీయ స్థానం సాధించారు. విజేతలకు మెమెంటోలు అందజేశారు. రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనే అవకాశం లభించనుంది.ఈ కార్యక్రమంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ మిలకూరి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, ఫోరమ్ సభ్యులు నాగుల భుజన్ చందర్, నలుమాచు చంద్రశేఖర్, కామిరెడ్డి రామేశ్వర్ రెడ్డి, గైడ్ టీచర్లు గోరంటల ఆనందం, ఎండీ మునీరొద్దిన్, 32 పాఠశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కూలీల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యం - మనాలి ఠాకూర్



**పాలకుర్తి, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ కూలీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని రామగుండం నియోజకవర్గ మక్కన్ సింగ్ సేవా సమితి అధ్యక్షురాలు మనాలి ఠాకూర్ అన్నారు. సోమవారం పాలకుర్తి మండలంలోని ఈశాల తక్కల్లపల్లి, పుట్నూరు, జయ్యారం, గుడిపల్లి, కుక్కల గూడూరు గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలను ప్రత్యక్షంగా కలుసుకుని వారి కష్టసుఖాలు, జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలం దృష్ట్యా పని చేసే ప్రదేశాల్లో తాగునీరు, నీడ, డీహైడ్రేషన్‌కు గురి కాకుండా గ్లూకోస్ డ్రింక్స్, గాయపడిన వారికి అత్యవసర చికిత్స కోసం మెడికల్ కిట్ ఏర్పాటు చేయాలని సూచించారు.పనిదినాల హాజరు పట్టికలో తప్పులు లేకుండా కూలీల కష్టానికి తగిన వేతనం అకౌంట్లలో జమ అయ్యేలా చూడాలని మేట్‌లను కోరారు. ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భద్రత కలగాలని, ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు కాసర్ల కిరణ్, తోట ప్రశాంత్, మాజీ ఎంపీపీ గంగాధర రమేష్‌తో పాటు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి



**కరీంనగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇచ్చి వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ కలిసి దరఖాస్తులను స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు.మొత్తం 367 దరఖాస్తులు అందగా, వీటిలో అత్యధికంగా కరీంనగర్ నగరపాలిక సంస్థకు 41, హౌసింగ్ శాఖకు 37 దరఖాస్తులు వచ్చాయి.ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేష్ బాబు, ఏవో సుధాకర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ మేయర్ శ్రీనివాస్‌కు ఘన సన్మానం





**కరీంనగర్, ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కార్పొరేషన్ తొలి బీజేపీ మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన కొలగాని శ్రీనివాస్‌ను బీజేపీ సీనియర్ నాయకులు కైలాస నవీన్, గాండ్ల శ్రీనివాస్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. మనోహర్, ఆర్యవైశ్య అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఏవి మల్లికార్జున్, వైశ్య సేవా కేంద్రం డైరెక్టర్ రామిడి శ్రీధర్‌లు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కైలాస నవీన్ మాట్లాడుతూ మేయర్ శ్రీనివాస్ గతంలో ఏబీవీపీ,ఆర్ఎస్ఎస్,ఎన్వైపి, ఎన్ఐఎఫ్ఎఫ్ఎ వంటి సంస్థల్లో సేవలు అందించారని, కార్పొరేటర్‌గా ఎన్నో అభివృద్ధి పనులు చేసి ప్రజలతో కుటుంబ సభ్యునిలా అందుబాటులో ఉండేవారని గుర్తుచేశారు. ఆయన సేవలను గుర్తించి మళ్లీ డివిజన్ ప్రజలు కార్పొరేటర్‌గా గెలిపించడం, పార్టీ వారిని మేయర్‌గా ఎంపిక చేయడం పట్టణ ప్రజల అదృష్టమని అన్నారు.మేయర్ ఎంపికకు సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# శ్రీ భక్తాంజనేయ శివ పంచాయతన విగ్రహ స్వామి ఊరేగింపు,,,

వైభవంగా కోమటిపల్లి లో భక్తాంజనేయ దేవాలయ పున్న నిర్మాణ కార్యక్రమం

**రామాయంపేట ఫిబ్రవరి 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామాయపేట మున్సిపల్ పరిధిలోని కోమటిపల్లి గ్రామంలో శ్రీ భక్తాంజనేయ శివ పంచాయతన స్వామి విగ్రహ దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు గ్రామ ప్రజలు మరి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు ఏసు రమేష్ రెడ్డి మరియు జనతా పార్టీ నాయకుడు భానుచందర్ తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయ గుణ నిర్మాణానికి అందరు సహకారంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు .ఇందులో భాగంగా 23 నుండి 26 వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆధ్యాత్మిక ఆచార్యులు మాధవానంద సరస్వతి ప్రత్యేక హహ్వాంగా వస్తున్నారని వాళ్ళు తెలిపారు.ఈ కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు కూడా ఆహ్వానం పంపినామని వస్తున్నట్లు వారు తెలిపారు .సోమవారం రోజున రామాయంపేట పట్టణం నుండి స్వామివారి విగ్రహాన్ని ఊరేగింపుగా బ్యాండ్ మేళాలతో తీసుకువెళ్లారు.



గ్రామంలో ఉన్న శ్రీ భక్తాంజనేయ శివపంచాయతన